# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com | ఎడిటర్:బైస దేవదాస్: సెల్:9000065433 | E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 24-6-2023 | RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 | సంపుటి:29 | సంచిక:246 | పేజీలు:6 | వెల: రూ.1/-


## ఉద్యోగులు, పెన్షనర్లకు సర్కార్ వరాల జల్లు

హైదరాబాద్, జూన్ 23:అనుకున్నట్లుగానే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ తీపికబురునందించింది. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త చెప్పిన ప్రభుత్వం విభాగాల వారీగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చే అలవెన్సులను భారీగా పెంచింది. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం విధిగా ఇచ్చే అలవెన్సుల మొత్తాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్న సర్కార్ వెంటనే జీవోలను విడుదల చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అలవెన్సులను పెంచుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగుల ప్రయాణ భత్యం, కన్వేయన్స్‌ను 30శాతం, బదలీపై వెళ్లే ఉద్యోగులకు రవాణా అలవెన్సును కూడా భారీగా అంటే 30శాతం పెంచుతూ తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

సెలవుదినాల్లో పనిచేసే లిఫ్ట్ ఆపరేటర్లు, డ్రైవర్లకు అదనంగా రూ.150 చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. షెడ్యూల్ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు స్పెషల్ కాంపన్సెటరీ అలవెన్సును 30శాతానికి పెంచారు. దివ్యాంగ ఉద్యోగులకు ఇచ్చే కన్వేయన్స్ అలవెన్స్‌ను రూ.2వేలనుంచి రూ.3వేలకు పెంచుతూ నిర్ణయించారు. ఇళ్లు, కారు, మోటార్ సైకిల్ కొనుగోలుకు ఇచ్చే అడ్వాన్స్ పరిమితిని కూడా పెరుతూ నిర్ణయించిన ప్రభుత్వం వివరాలను జీవోలో పేర్కొంది. ఈ క్రమంలో ఉద్యోగులు ఇండ్లు నిర్మించుకునేందుకు ఇచ్చే అడ్వాన్స్ పరిమితిని రూ.20లక్షల నుంచి రూ.30లక్షలకు పెంచింది. నాలుగు చక్రాల వాహనం కొనుగోలుకు అడ్వాన్స్ పరిమితిని రూ.6లక్షలనుంచి రూ.9లక్షలకు పెంచుతూ నిర్ణయించింది. మోటార్ సైకిల్‌కు రూ.80వేలనుంచి రూ.లక్షకు పెంచారు.

ఉద్యోగుల పిల్లల పెళ్లిళ్లకు సంబంధించి అడ్వాన్స్ మొత్తాన్ని పెంచగా, కుమార్తె పెళ్లికి అడ్వాన్స్‌గా రూ. లక్షనుంచి రూ. 4లక్షలకు, కుమారుడి పెళ్లికి ఇచ్చే అడ్వాన్స్‌ను రూ.75వేలనుంచి రూ. 3లక్షలకు పెంచారు. రాష్ట్ర శిక్షణా ఇన్‌స్టిట్యూట్‌లకు చెందిన ఉద్యోగులకు ఇచ్చే ఇన్సెంటివ్‌ను 30శాతానికి పెంచింది. గ్రేహౌండ్స్, ఇంటలిజెన్స్, ట్రాఫిక్, సీఐడీ, ఆక్టోబస్, యాంటి నక్సలైట్ స్క్వాడ్ విభాగాల్లో పనిచేసే పోలీసులకు ఇచ్చే స్పెషల్ పే కూడా 2020 పే ప్రకారం వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. పెన్షనర్లు మరణిస్తే అందించే తక్షణ సాయం రూ. 20వేలనుంచి రూ. 30వేలకు పెంచారు. ప్రోటోకాల్ విభాగంలో విధులు నిర్వహించే అన్ని కేటగిరీల్లోని ఉద్యోగులకు అదనంగా 15శాతం స్పెషల్ పే మంజూరీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది.త్వరలో ప్రభుత్వ ఉద్యోగులకు చెందిన అనేకర పెండింగ్ సమస్యలు పరిష్కారం కానున్నాయని తెలుస్తోంది. రెవెన్యూతోపాటు పలు వాఖల్లో పదోన్నతుల అంశం త్వరలో సాకారం కానుంది. అన్ని శాఖల్లో ఉద్యోగులు కోరిన కీలకమైన అన్ని కోరికలను సీఎం కేసీఆర్ ఆమోదించే దిశగా సర్వం సిద్ధమైంది. ఈ దిశలో ఉద్యోగ సమస్యలను, నూతన వేతన సవరణను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఒక్కో శాతం ఫిట్‌మెంట్‌కు అయ్యే ఖర్చు, మొత్తం ఉద్యోగులు, వారి మూలవేతనం, స్థిరీకరణతో కలిగే ఆర్థిక భారాలను ఆర్థిక శాఖతో సీఎం కేసీఆర్ ఆరా తీశారు.

మధ్యంతర భృతిని వాయిదా వేయాలని ప్రభుత్వం తొలుత భావించినప్పటికీ ఉద్యోగులు పట్టుపడితే ఐఆర్ ప్రకటనకూ సిద్ధంగా ఉన్నట్లుగా తెలిసింది. మార్కెట్ పరిస్థితులు, పెరిగిన ధరలను ప్రామాణికంగా తీసుకుని నిర్ణయించే పీఆర్‌సీ ఫిట్‌మెంట్‌ను ఈ దఫా కొత్త పద్ధతిలో కేవలం మూడు నెలల్లో పూర్తి చేయాలని సీఎం ఆదేశించనున్నారు. కాంట్రిబ్యూటరీ ఫించన్ విధానం ఎత్తివేతపై సాధ్యాసాధ్యాల పరిశీలన, అధ్యయనానికి ఉన్నత స్థాయి కమిటీని కూడా సీఎం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

## ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణకు సహకారం అందిస్తాం: ప్రధాని మోడీ

న్యూ డిల్లీ జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభం నుంచి చర్చలు, దౌత్యం ద్వారా వివాద పరిష్కారానికి భారత్ ప్రాధాన్యనిస్తోందని, ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణకు మేం చేయగలిగిన సహకారం అందిస్తామని ప్రధాని పేర్కొన్నారు. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు స్ఫూర్తిని కొనసాగిస్తామని మోదీ అన్నారు.మరోవైపు అభివృద్ధి చెందుతున్న దేశాలలో యుద్ధం పరిణామాలను తగ్గించేందుకు మరింత కృషి చేయాలని ఇరు దేశాల నేతలు పిలుపునిచ్చారు. ఉక్రెయిన్ ప్రజలకు నిరంతరం మానవతా సహాయం అందిస్తామని రెండు దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. అంతర్జాతీయ చట్టం, ఐఔ చార్టర్ సూత్రాలు, ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని గౌరవించాలని పిలుపునిచ్చారు. ఉక్రెయిన్‌లో సంఘర్షణ అనంతర పునర్నిర్మాణం ప్రాముఖ్యతపై రెండు దేశాలు ఏకీభవించాయి.

## షోలాపూర్‌లోని పంఢరిపూర్‌ను సందర్శించనున్న సీఎం కేసీఆర్..

హైదరాబాద్, జూన్ 23:బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కె. చంద్రశేఖర్ రావు.. ఆయన మంత్రివర్గం సభ్యులు ఆషాఢ ఏకాదశికి రెండు రోజుల ముందు (జూన్ 27) విఠల్ రుక్మిణి మందిర్‌లో ప్రార్ధనలు చేయనున్నారు. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయం పంఢర్‌పూర్‌ను వారు సందర్శించనున్నట్టు తెలుస్తోంది.

సంత్ జ్ఞానేశ్వర్, సంత్ తుకారాం పల్లకీలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్న భారత రాష్ట్ర సమితి మహారాష్ట్ర ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే శంకర్ అన్నా ధోంగే ఇవ్వాల (శుక్రవారం) తెలిపారు. తెలంగాణ నుంచి అనేక మంది భక్తులు పంఢర్‌పూర్‌కు కాలినడకన తీర్థయాత్రలు చేస్తారని ఆయన తెలిపారు.

## రాష్ట్రంలో కొత్తగా 17 బీసీ డిగ్రీ గురుకులాలు ప్రారంభం..

హైదరాబాద్, జూన్ 23:వెనుకబడిన వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం కేసీఆర్ సర్కార్ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17 నూతన బీసీ డిగ్రీ గురుకులాలు ప్రారంభించడానికి శుక్రవారం జీవో జారీ చేయడమే అందుకు నిదర్శనం అన్నారు.

తెలంగాణకు పూర్వం కేవలం 19 బీసీ గురుకులాలు అరకొర వసతులతో ఉండేవని, ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పంతో వాటిని నేడు 327కు పెంచుకున్నామని కమలాకర్ తెలిపారు. విద్య ద్వారా వెనుకబడిన వర్గాల జీవితాల్లో సమూల మార్పులు వస్తాయని నమ్మే సీఎం కేసీఆర్, అందుకోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటారన్నారు. కేవలం బీసీ గురుకులాల ద్వారానే రాష్ట్రంలో దాదాపు 2 లక్షల మంది వెనుకబడిన బిడ్డలు ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గత విద్యా సంవత్సరం 15 డిగ్రీ కాలేజీలను మంజూరు చేసుకొని క్లాసులు ప్రారంభించుకున్నామని, వాటి ద్వారా 15,360 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం ప్రారంభించే డిగ్రీ కాలేజీల్లో 16,320 మందికి లబ్ది చేకూరుతుందన్నారు. కేవలం డిగ్రీ గురుకులాల్లోనే 31,680 మందికి ప్రపంచస్థాయి విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఈ నూతన డిగ్రీ కాలేజీలతో రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో బీసీ గురుకుల డిగ్రీ కాలేజీ ఏర్పాటవుతుందన్నారు.

కొత్త డిగ్రీ కాలేజీలు ఇవే..

ఈ ఏడాది ప్రారంభించబోయే బీసీ డిగ్రీ గురుకులాల్ని జోగులాంబ గద్వాల్, నారాయణ్ పేట్, నాగర్ కర్నూల్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, ఆదిలాబాద్, కొమరంభీం అసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ప్రారంభించనున్నారు.







## హైదరాబాద్‌లో స్కైవేల కోసం రక్షణ శాఖ భూములు కేటాయించండి : మంత్రి కేటీఆర్



న్యూఢిల్లీ, జూన్ 23: హైదరాబాద్‌లో స్కైవేలు, స్కై వాక్స్ కోసం రక్షణ శాఖ భూములు కేటాయించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరినట్లు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్.. రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఇవాళ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకొని పోతున్నదని మేం చెప్పుకోవడం కాదు.. కేంద్ర ప్రభుత్వమే చెప్తుంది అని కేటీఆర్ తెలిపారు. అయితే ఈ అభివృద్ధి పరంపర కొనసాగే క్రమంలో.. తెలంగాణ రాష్ట్రం వేగంగా ఎదుగుతూ, విస్తరిస్తూ జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుంది. కాబట్టి ఈ రాష్ట్రానికి చేయూతనివ్వండి, మద్దతు ఇవ్వండి. తద్వారా జాతి నిర్మాణంలో మరింత ఉధృతంగా పాల్గొనే అవకాశం వస్తుంది. భారతదేశానికి కూడా లాభం జరుగుతుందనే మాటను కేంద్రానికి చాలాసార్లు చెప్పామని కేటీఆర్ గుర్తు చేశారు.

### తొమ్మిదేండ్లలో ఐదుగురు రక్షణ శాఖ మంత్రులను కలిశాం..

స్కైవేలు, స్కై వాక్స్ కోసం రక్షణ శాఖ భూములు కేటాయిస్తే.. ల్యాండ్ ఫర్ ల్యాండ్ కూడా ఇస్తామని, తొమ్మిదేండ్ల కాలంలో ఐదుగురు రక్షణ శాఖ మంత్రులను 15 నుంచి 20 సార్లు కలిశామని కేటీఆర్ గుర్తు చేశారు. స్వయంగా ప్రధానిని మా ముఖ్యమంత్రి కలిశారు. హైదరాబాద్ నగరం భారతదేశంలోనే శరవేగంగా విస్తరిస్తున్న నగరం. ఐటీ రంగం ఎదుగుతుంది. ఐటీ ఉద్యోగాల్లో 44 శాతం ఉద్యోగాలు ఒక్క హైదరాబాద్ నుంచే వస్తున్నాయి. మరో వైపు వ్యాక్సిన్ ప్రొడక్షన్‌కు హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారింది. ఫార్మా, బయోటెక్ రంగంలో అదే విధంగా ఐటీ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో కూడా అత్యంత కీలకమైన నగరంగా ఎది గింది. ఏ రకంగా చూసినా ఈ నగరం జాతి నిర్మాణానికి ఉపయోగపడే నగరం కాబట్టి.. మాకు మౌలిక వస తుల కల్పనలో సహాయం అందిం చండి. స్కైవేల నిర్మాణం కోసం రక్షణ శాఖ భూములు కేటాయించాలని తొమ్మి దేండ్ల నుంచి కోరుతున్నాం అని కేటీఆర్ తెలిపారు.

### రాజ్‌నాథ్ సింగ్‌కు నాలుగు విషయాలు విజ్ఞప్తి చేశాం..

ఇవాళ ప్రత్యేకంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ప్రత్యేకంగా నాలుగు విషయాలు విజ్ఞప్తి చేయడం జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ లాంటి పెరుగుతున్న నగరానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అందిన సాయం సున్నా. ఏ సహాయం రాలేదు. 2020 సంవత్సరంలో హైదరాబాద్ నగరం వరదలకు అతలాకుతలమైతే ఒక్క పైసా కూడా సహాయం చేయలేదు. మీరు సహాయం చేయకపోతే చేయకపోయారు కానీ.. కనీసం అభివృద్ధికి ఆటంక పరచకండి. స్కైవేల నిర్మాణానికి ల్యాండ్ ఇస్తే.. మరో ల్యాండ్ ఇస్తామని కూడా చెప్పాం. జేబీఎస్ నుంచి రాజీవ్ రహదారి వరకు స్కైవే నిర్మాణానికి 96 ఎకరాల ల్యాండ్ ఇవ్వమని కోరాం. దానికి సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమిని కేటాయిస్తామని చెప్పాం. ప్యాట్నీ నుంచి నాగ్‌పూర్ హైవే వరకు 18.5 కిలోమీటర్ల మేర స్కైవే నిర్మించాలని అనుకుంటున్నాం. దాని కోసం 56 ఎకరాలు ఇవ్వాలని కోరాం. దీనికి కూడా ల్యాండ్ ఫర్ ల్యాండ్ ఇస్తామని చెప్పాం. ఈ రెండు స్కైవేలకు డీపీఆర్ కూడా సిద్ధమై ఉంది. కేంద్రం అనుమతిస్తే హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వెంటనే పనులు ప్రారంభిస్తాం అని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో స్కైవాక్స్ కడుతున్నాం. ఉప్పల్‌లో స్కైవాక్ పూర్తయింది. ఈ సోమవారం ప్రారంభించబోతున్నాం. మెహిదీపట్నం రైతుబజార్ వద్ద కూడా స్కైవాక్ కట్టబోతున్నాం. దురదృష్టావశాత్తు అక్కడ కూడా రక్షణ శాఖ భూములు ఉన్నాయి. అక్కడ ఒక అర ఎకరం ల్యాండ్ కావాలి. దానికి కూడా ఇవ్వట్లేదు. ఆ స్థలాన్ని వెంటనే ఇవ్వమని కేంద్ర మంత్రిని కోరడం జరి గింది. హైదరాబాద్ మహానగరంలో కొత్త గా పెద్ద ఎత్తున లింక్ రోడ్డులు కూడా ఏ ర్పాటు చేస్తున్నాం. దాదాపు 142 లింక్ రోడ్లను ప్లాన్ చేశాం. అందులో రెండు, మూడు కారిడార్లకు సంబంధించి రక్షణ శాఖ భూములు అడ్డు వస్తున్నాయి. వాటికి కూడా అనుమతివ్వండి అని కేంద్ర మంత్రికి ప్రత్యేకంగా చెప్పడం జరిగింది. వీటన్నింటిని కేంద్ర రక్షణ మంత్రి సానుకూలంగా పరి శీలిస్తారని ఆశిస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## వరద ముంపు కష్టాలకు చెక్.. పికెట్ నాలాపై నిర్మించిన బ్రిడ్జి ప్రారంభం



హైదరాబాద్, జూన్ 23: ఎన్నో సంవత్సరాల నుండి వరద ముంపునకు గురవుతున్న ప్రజల కష్టాలు సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమంతో తొలగిపోతున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం మినిస్టర్ రోడ్డులోని పికెట్ నాలాపై ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు నాలాల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. దీని వలన ఎన్నో సంవత్సరాల నుండి నాలాల పరిసర కాలనీల ప్రజలు ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతూ అనేక ఇబ్బందులకు గురయ్యేవారని చెప్పారు. బాధిత ప్రజల సమస్య పరిష్కారం గురించి కనీసం ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వాటిని పరిష్కరించాలనేది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. నాలాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా వరదముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచనతో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. నాలాల వెంట ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపు, పూర్తిస్థాయిలో పూడిక తొలగించడం, శిథిలావస్థలో ఉన్న, ఇరుకుగా ఉన్న బ్రిడ్జిల స్థానంలో నూతనంగా విశాలమైన బ్రిడ్జిలను నిర్మించడం వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా పికెట్ నాలాపై కరాచీ బేకరీ వద్ద రూ. 10 కోట్ల వ్యయంతో బ్రిడ్జిని నిర్మించి ప్రారంభించడం జరిగిందని మంత్రి తలసాని తెలిపారు. అదేవిధంగా మినిస్టర్ రోడ్డులోని పికెట్ నాలాపై నిర్మించిన బ్రిడ్జిని ఈరోజు ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఇవే కాకుండా బేగంపేటలోని నాలా అభివృద్ధి పనులు, ముషీరాబాద్, అంబర్ పేట నియోజకవర్గాల మీదుగా మూసీ వరకు ఉన్న హుస్సేన్ సాగర్ నాలా అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నాయని అన్నారు. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం క్రింద అభివృద్ధి పనులు జరిగిన ప్రాంతాలలో వరదముంపు సమస్య నుండి ప్రజలకు విముక్తి లభించిందని అన్నారు. నగరంలో ఉన్న అన్ని నాలాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, ఎస్ఎన్‌డీపీ సీఈ కిషన్, ఎస్ఈ భాస్కర్ రెడ్డి, ఈఈ శ్రీధర్, జోనల్ కమిషనర్ శ్రీధర్, ఈఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మూకశ్మీర్‌లోకి చొరబడేందుకు ఉగ్రవాదుల యత్నం

### – నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన భద్రతా బలగాలు

శ్రీనగర్ జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జమ్మూకశ్మీర్‌లోకి చొరబడేందుకు ఉగ్రవాదులు చేసిన యత్నాలను భద్రతా బలగాలు శుక్రవారంనాడు విజయవంతంగా తిప్పికొట్టాయి. నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి మన భూభాగంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులను ఆర్మీ , పోలీసులతో కూడిన సంయుక్త బృందం మట్టుబెట్టినట్టు కశ్మీర్ జోన్ పోలీసులు ఒక ట్వీట్‌లో తెలిపారు. గత శుక్రవారంనాడు కూడా భద్రతా బలగాలు చొరబాటుదారుల యత్నాలను తిప్పికొట్టాయి. కెరాన్ సెక్టార్‌లోని జుమాగుండ్ ప్రాంతంలో ఐదుగురు ఉగ్రవాదులను బలగాలు కాల్చిచంపాయి.మరోవైపు, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జమ్మూలో పర్యటిస్తు?న్నారు. ఒకరోజు పర్యటన కోసం జమ్మూ చేరుకున్న అమిత్‌షాకు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్వాగతం పలికారు.

## కట్టెకోలను సత్కరించిన కల్వకుంట్ల

### – జాగృతి ఆధ్వర్యంలో జరిగిన సన్మానం
### – అభినందించిన గౌరీ శంకర్ శ్రీధర్‌లు



ఖమ్మం, జూన్ 23:(నేటినిజం ప్రతినిధి): భారత జాగృతి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాదులోని బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్ లో రెండు రోజులపాటు సాహిత్య సభలను ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ముగింపు సభలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన కవులను సంస్థ సత్కరించింది. ఈ సభలకు హాజరైన ఖమ్మంకు చెందిన ప్రముఖ కవి, జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యను ఎమ్మెల్సీ, భారత జాగృతి సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మెమెంటోతో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ లు నరసయ్యను అభినందించారు

## గిరిజన సహకార సంస్థలో కారుణ్య నియామకాలు.. జీసీసీ ఇమేజ్ పెంచాలన్న మంత్రి సత్యవతి

హైదరాబాద్, జూన్ 23:మానవీయ కోణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కారుణ్య నియామకాలు చేపట్టారని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమభవన్‌లోని జీసీసీ కార్యాలయంలో (గిరిజన సహకార సంస్థ) ఆమె 30 మందికి ఆమె కారుణ్య నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. జీసీసీ ఉద్యోగులు సంస్థ పురోభివృద్ధికి తోడ్పాటును అందిచాలని సూచించారు. ఇప్పటికే జీసీసీ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తుందని, జీసీసీ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచాలని ఆమె దిశానిర్దేశం చేశారు. జీసీసీని నమ్ముకుని విధుల్లో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని, అందులో భాగంగానే మానవీయ కోణంలో ఆ కుటుంబాల నుంచి అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ జీసీసీ శానిటైజర్ ఉత్పత్తి చేయటం వల్ల జీసీసీ కేవలం అటవీ ఉత్పత్తులనే కాకుండా సమాజ అవసరాలను తీర్చేందుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు.

రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని ఆమె వివరించారు. రాష్ట్రంలో 2014 నుంచి గిరిజనులకు స్వర్ణయుగాన్ని ఆవిష్కరిస్తున్నదన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన దినోత్సవం, సంక్షేమ దినోత్సవం అద్భుతంగా జరుపుకున్నామని దేశంలోనే ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలతోపాటు, చిరు ఉద్యోగులను సైతం గుండెలో పెట్టుకొని చూసుకుంటున్నారని ఆమె ఉదహరించారు.

ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ వాల్యా నాయక్, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి, జీసీసీ జీఎం సీతారాంనాయక్, చీఫ్ ఇంజనీర్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ ఉప ఉత్పతులుగా ఉత్పత్తి అయ్యే వంట పాత్రలకు ప్రామాణికం నిర్దేశించిన బిఐఎస్

న్యూఢిల్లీ, జూన్ 23: వ్యవసాయ ఉప ఉత్పతులుగా ఉత్పత్తి అయ్యే వంట పాత్రలకు ప్రమాణాలు నిర్దేశిస్తూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ఉత్తర్వులు జారీ చేసింది. ఎా 18267: 2023 ప్రమాణాలు వ్యవసాయ ఉప ఉత్పతులుగా ఉత్పత్తి అయ్యే వంట పాత్రలకు వర్తిస్తాయని బిఐఎస్ పేర్కొంది.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం, సుస్థిర అభివృద్ధి సాధించడం లక్ష్యంతో "అగ్రి ఉప-ఉత్పత్తుల నుండి తయారు చేసిన ఆహారాన్ని అందించే పాత్రలు – స్పెసిఫికేషన్"ను బిఐఎస్విడుదల చేసింది. తయారీదారులు, వినియోగ దారులకు సమగ్ర మార్గదర్శకాలు అందిస్తుంది, దేశవ్యాప్తంగా నాణ్యత విధానాలు ఒకే విధంగా ఉండేలా బిఐఎస్ చర్యలు అమలు చేస్తుంది.

త్వరగా భూమిలో కలిసిపోయే వంట గది పరికరాలు ఉపయోగించడం వల్ల పర్యావరణ భద్రత, సహజ వనరులను సంరక్షించి వృత్తాకార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి అవకాశం కలుగుతుంది. లక్ష్యాలను సాధించడానికి వీలు కల్పించే విధంగా ప్రమాణాలు రూపొందాయి. వ్యవసాయ ఉప ఉత్పత్తులను ఉపయోగించి తయారయ్యే పాత్రల్లో హానికరమైన పదార్థాలు ఉండవు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పాత్రలు ఉత్పత్తి అవుతాయి. శ్రేయస్సును నిర్ధారిస్తాయి. బిఐఎస్ నిర్దేశించిన ప్రమాణం వల్ల రైతులకు ఆర్థిక అవకాశాలు ఎక్కువగా అందుబాటులోకి వస్తాయి. స్థిరమైన వ్యవసాయ పద్ధతులు అమలు లోకి రావడం వల్ల గ్రామీణ అభివృద్ధి సాధ్యమవుతుంది.

ప్రపంచవ్యాప్తంగా ఒకసారి వాడి పారవేసి వస్తువుల వినియోగం పెరుగుతోంది. డిస్పోజబుల్ ప్లేట్ మార్కెట్ పరిమాణం 2020లోవి 4.26 బిలియన్‌గా ఉంది. 2028 నాటికి మార్కెట్ పరిమాణం వి 6.73 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా. ఇది 2021 నుంచి 2028 వరకు 5.94% వార్షిక వృద్ధి రేటు సాధించింది.

భారతదేశంలో అనేక పెద్ద, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాయి తయారీదారులు బయోడిగ్రేడబుల్ వంట పాత్రల ఉత్పత్తి రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. బిఐఎస్ నిర్దేశించిన ప్రమాణంతో ఉత్పత్తిదారులు ప్రయోజనం పొందుతారు. ఈ ఉత్పత్తులకు డిమాండ్ నిలకడగా పెరుగుతోంది, వారి ఉత్పత్తిలో పాల్గొన్న తయారీదారుల సంఖ్యలో స్థిరమైన వృద్ధికి దారి తీస్తుంది.

బయోడిగ్రేడబుల్ పాత్రల ఉత్పత్తికి ముడి పదార్థాలు, తయారీ పద్ధతులు, పనితీరు, పరిశుభ్రత అవసరాలతో సహా వివిధ అంశాలు ప్రమాణం పరిధిలోకి వస్తాయి. ప్లేట్లు, కప్పులు, గిన్నెలు లాంటి ఉత్పత్తులు తయారు చేయడానికి ముడి పదార్థాలుగా ఆకులు, తొడుగులు వంటి వ్యవసాయ ఉప-ఉత్పత్తుల వినియోగాన్ని ఇది నిర్దేశిస్తుంది. మొక్కలు, చెట్ల భాగాల ఏ విధంగా ఉపయోగించాలి అన్న అంశాన్ని ప్రమాణం సిఫార్సు చేస్తుంది. హాట్ ప్రెస్సింగ్, కోల్డ్ ప్రెస్సింగ్, మౌల్డింగ్ , స్టిచింగ్ వంటి తయారీ సాంకేతికతలను అందిస్తుంది. పదునుగా ఉండే పరికరాల వినియోగం, రసాయనాల వినియోగాన్ని ప్రమాణం నిషేధిస్తుంది.

# కాంగ్రెస్‌లో విలీనం వార్తలపై షర్మిల ఫస్ట్ రియాక్షన్ !

హైదరాబాద్ జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కాంగ్రెస్ లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ విలీనమంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిల స్పందస్తూ ట్వీట్ చేశారు. "వైఎస్ షర్మిల రెడ్డి తన చివరి శ్వాస వరకు తెలంగాణ బిడ్డగా..తెలంగాణ కొరకు పోరాడుతూనే ఉంటది.. ఊహాజనిత కథలు కల్పిస్తూ, నాకు, తెలంగాణ ప్రజల మధ్య అగాధాన్ని సృష్టించే విఫలయత్నాలు జరుగుతున్నాయి.. పనిలేని, పసలేని దార్శనికులకు నేను చెప్పేది ఒకటే.. నా రాజకీయ భవిత మీద పెట్టే దృష్టిని, సమయాన్ని కేసీఆర్ పాలనపై పెట్టండి.. అన్నివిధాలుగా కేసీఆర్ సర్కారు పాలనలో.. సర్వనాశనమైపోతున్న తెలంగాణ భవితమీద పెట్టండి.. కేసీఆర్ కుటుంబం అవినీతిని ఎండగట్టండి.. నా భవిష్యత్తు తెలంగాణతోనే.. నా ఆరాటం, నా పోరాటం తెలంగాణ కోసమే.. జై తెలంగాణ" అంటూ షర్మిల ట్వీట్ చేశారు.

# ఈశాన్య ప్రాంతానికి సంబంధించిన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనపై సమీక్ష సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 23:భారత ఆర్థిక వ్యవస్థలో మత్స్య రంగం కీలక పాత్ర పోషిస్తోంది. ఇది జాతీయ ఆదాయం, ఎగుమతులు, ఆహారం మరియు పోషకాహార భద్రతతో పాటు ఉపాధి కల్పనకు దోహదం చేస్తుంది. ఈ రంగం ప్రాథమిక స్థాయిలో 2.8 కోట్ల కంటే ఎక్కువ మంది మత్స్యకారులు మరియు చేపల పెంపకందారులకు జీవనోపాధిని అందిస్తుంది. అలాగే మత్స్య విలువ గొలుసుతో మరింత మందికి ఉపాధి లభిస్తోంది. దేశంలోని ఆర్థికంగా వెనుకబడిన జనాభాలో అధిక సంఖ్యలో ఉన్నవారికి ఇది ప్రధాన ఆదాయ వనరు.

రంగాల లాభాలను ఏకీకృతం చేయడానికి మరియు మత్స్య రంగ వేగవంతమైన వృద్ధిని కొనసాగించడానికి 2014 నుండి భారత ప్రభుత్వం చేపల ఉత్పత్తి మరియు ఉత్పాదకత, సాంకేతికత ఇన్ఫ్యూషన్ రంగాలలో బహుముఖ వ్యూహాలు మరియు కేంద్రీకృత జోక్యాల ద్వారా పరివర్తన మార్పులు/సంస్కరణలకు నాంది పలికింది. మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం మరియు ఆధునీకరించడం, దేశీయ వినియోగం మరియు ఎగుమతులను పెంపొందించడం, వ్యవస్థాపకత మరియు ఉపాధి వృద్ధి మొదలైనవి మత్స్యకారులు మరియు చేపల పెంపకందారుల సంక్షేమంలో ప్రధానమైనవి. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్‌వై) (2020-21 నుండి 2024-25) రూ. 20,050 కోట్ల పెట్టుబడితో ప్రారంభించబడింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 9407 కోట్లు.

ఇప్పటి వరకు, పిఎంఎంఎస్‌వై కింద 2020-21 నుండి 2022-23 వరకు రూ. 14,654.67 కోట్ల విలువైన ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయి. ఇప్పటి వరకు ఊహించిన పెట్టుబడిలో దాదాపు ది73% సాధించబడింది. అదేవిధంగా 2020-21 నుండి 2022-23 వరకు కేంద్ర వాటా రూ. 9,407 కోట్లకు గాను రూ. 6,140.82 కోట్ల కేంద్ర వాటా ఆమోదించబడింది.

పిఎంఎంఎస్‌వై నాల్గవ సంవత్సరంలోకి అడుగుపెట్టినందున పథకం అమలును వేగాన్ని వేగవంతం చేయాలని ఈ శాఖ యోచిస్తోంది. దీని కోసం జూన్ 21 నుండి 24వ తేదీ వరకు శ్రీ అభిలాక్ష్ లిఖి, ఓఎస్‌డి,డిఓఎఫ్ (భారత ప్రభుత్వం) అధ్యక్షతన రాష్ట్రాలు/యుటిల సమీక్షా సమావేశాలను నిర్వహించాలని డిపార్ట్‌మెంట్ యోచిస్తోంది. సమీక్షా సమావేశంలో రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2023-24, కేంద్ర నిధుల వినియోగం, రాష్ట్ర వాటా విడుదల, ఎస్ఎన్ఏ సంబంధిత సమస్యలు మరియు 1 జూలై 2023 నుండి 31 మార్చి 2024 వరకు వర్గీకరించబడిన ప్రాజెక్టుల అమలు వ్యూహంపై చర్చ దృష్టి సారిస్తుంది.

ఈ సిరీస్‌లో మొదటి సమీక్ష సమావేశం జూన్ 21న నార్త్ ఈస్టర్న్ రీజియన్ (ఎన్ఈఆర్)తో జరిగింది. సంబంధిత ఎన్ఈఆర్ రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు సమావేశానికి హాజరయ్యారు మరియు భారత ప్రభుత్వ డిఓఎఫ్ సీనియర్ అధికారులతో సంభాషించారు. ఎన్ఈఆర్‌లో మత్స్య అభివృద్ధిపై నీతిఆయోగ్ అలాగే ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. పిఎంఎంఎస్‌వైకింద (ఎఫ్‌వై 2020-21 నుండి ఎఫ్‌వై 2022-23) రూ. 958.26 కోట్ల విలువైన ప్రాజెక్ట్ రూ. 525.28 కోట్ల కేంద్ర వాటాతో మంజూరు చేయబడింది.ఎన్ఈఆర్‌లో మొత్తం ఊహించిన పెట్టుబడిలో 72% (రూ. 1331 కోట్లు) మరియు కేటాయించిన కేంద్ర వాటాలో 68.39% (రూ. 768 కోట్లు) సాధించింది. 2014కి ముందు ఎన్ఈఆర్ రాష్ట్రాలకు అటువంటి నిర్దిష్ట కేటాయింపులేవీ జరగలేదని గమనించాలి. మంజూరైన కార్యకలాపాల్లో కొత్త చెరువులు, నవీకృత చేపల పెంపకం, అలంకారం కోసం ఉపయోగించే చేపల పెంపకం, బయోఫ్లోక్, ఆర్ఎఎస్, హేచరీలు, బ్రూడ్ బ్యాంక్‌లు, ఫీడ్ మిల్లులు మొదలైన ఉన్నాయి.

సమావేశ ఎజెండా ప్రకారం ఆర్థిక, భౌతిక పురోగతిపై చర్చించారు. అన్ని రాష్ట్రాలు ఆమోదించబడిన కార్యకలాపాలు/ప్రాజెక్టుల గ్రౌండింగ్ మరియు అమలును వేగవంతం చేయాలని మరియు తదుపరి విడత నిధుల విడుదల కోసం యుటిలైజేషన్ సర్టిఫికేట్‌ల (యూసిలు) సమర్పణను నిర్ధారించాలని హైలైట్ చేయబడింది. అదనంగా ఎస్ఎన్ఏ సమ్మతిని నెరవేర్చడానికి, నెలవారీ పురోగతి నివేదిక (ఎంపిఆర్) ప్రయాశ్ మరియు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) వంటి ముఖ్యమైన నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించడంతో పాటు రాష్ట్ర ఖజానా నుండి ఎస్ఎన్ఏకి లోటు మొత్తాన్ని బదిలీ చేయాలని అన్ని రాష్ట్రాలు కోరబడ్డాయి.

రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళికలను ప్రాజెక్ట్ అప్రైజల్ కమిటీ (పిఏసి) సమీక్షించిందని మరియు తదుపరి చర్య లేదా పునర్విమర్శ కోసం ప్రాజెక్టలను తరలించినట్లు రాష్ట్రాలకు తెలియజేయబడింది. ఇంకా ఎఫ్ఐ 20-21లో ఆమోదించబడిన అన్ని ప్రాజెక్టల కోసం 100% కేంద్ర బాధ్యతలను క్లియర్ చేసినందుకు రాష్ట్రాలు ప్రశంసించబడ్డాయి. అస్సాం మరియు మణిపూర్ వంటి రాష్ట్రాలు వారి మంచి భౌతిక పురోగతికి మరియు ఎంఐఎస్‌పై లబ్ధిదారుల సమాచారాన్ని నింపినందుకు ప్రశంసించబడ్డాయి. వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను తీర్చడం కోసం మత్స్యకారులు మరియు చేపల పెంపకందారులకు సంస్థాగత రుణాల యాక్సెస్‌ను సులభతరం చేయడానికి, కెసిసి దరఖాస్తులను పూరించడానికి లబ్ధిదారులను సమీకరించాలని రాష్ట్రాలు ప్రోత్సహించబడ్డాయి.

ప్రాజెక్టల గ్రౌండింగ్‌ను మెరుగుపరచడంలో నిరంతరం కృషి చేయడం మరియు నిర్ణీత సమయంలో ఆశాజనకమైన మెరుగుదలలను ప్రదర్శించడం కోసం రాష్ట్ర అధికారులు చర్చ మరియు పరిష్కారం కోసం ఆన్-గ్రౌండ్ సమస్యలు మరియు సవాళ్లను ముందుకు తెచ్చారు.

# ప్రజలకు మంచి చేయడం కోసమే జగనన్న సురక్ష: సీఎం జగన్

అమరావతి, జూన్ 23:ప్రజలకు మంచి చేయడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం జగన్ తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి మాట్లాడుతూ వివిధ కారణాలతో మిగిలిపోయిన లబ్ధిదారులకు మంచి చేయడమే జగనన్న సురక్ష అన్నారు. ఏ కారణం చేతనైన అర్హత ఉండి మిగిలిపోయిన వారికి లబ్ధి చేకూరుస్తామన్నారు. రాష్ట్రంలో 600 రకాల పౌరసేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలు అర్హులందరికీ అందాలన్నారు. ప్రజలకు మంచి చేసే కార్యక్రమమే జగనన్న సురక్ష అన్నారు. నవరత్నాల ద్వారా రూ. 2లక్షల 16వేల కోట్లు అందించామన్నారు. ఎక్కడా లంచాలకు తావులేకుండా పారదర్శకంగా పాలన అందిస్తున్నామన్నారు. నేరుగా బటన్ నొక్కి అక్కా చెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశామన్నారు.

సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్త స్థాయిలో పరిష్కారమే లక్ష్యమన్నారు. నెలరోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహణ ఉంటుందన్నారు. రేపటి నుంచి గృహాల సందర్శన ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.6 కోట్ల కుటుంబాలను బృందాలు

సందర్శించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 సురక్ష క్యాంపుల నిర్వహణ ఉంటుందన్నారు. '1902'తో హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అర్హులై ఉండి ఏ ఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న తపన, తాపత్రయంతో ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా దానిని పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం జగనన్న సురక్ష అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో శాచ్యురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వం.. అర్హులై ఉండి ఏ కారణంతోనైనా ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ఈ జగనన్న సురక్ష ద్వారా ఇంటింటినీ జల్లెడ పట్టనుందన్నారు. తద్వారా వారికి లబ్ధి చేకూర్చడంతో పాటు వారికింకేమైనా సర్టిఫికెట్లు (జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఇన్‌కమ్ మొదలైన 11 రకాలు ధ్రువీకరణ పత్రాలు) అవసరమైతే సర్వీస్ ఫీజు లేకుండా వాటిని ఉచితంగా అందించనుందన్నారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా.. లంచాలకు, వివక్షకు తావులేకుండా.. నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలేమైనా ఉంటే తెలుసుకుని పరిష్కారం చూపించే దిశగా చేస్తున్న వినూత్న కార్యక్రమం ఈ జగనన్న సురక్ష అన్నారు.

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, జగనన్న మీద, జగనన్న ప్రభుత్వం మీద ప్రేమ, అభిమానం ఉన్న ఉత్సాహవంతులతో కూడిన టీమ్ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటినీ సందర్శిస్తుందన్నారు. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావల్సిన పత్రాలు సేకరిస్తారు. వారికేమైనా కుల, ఆదాయ, జనన మొదలైన సర్టిఫికెట్లు అవసరమైతే వాటికి అవసరమైన పత్రాలను తీసుకుని దరఖాస్తులను దగ్గరుండి పూర్తిచేస్తారన్నారు. ఇలా తీసుకున్న దరఖాస్తులను సచివాలయానికి తీసుకెళ్లి వాటిని అక్కడ సమర్పించి, టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకుని వాటిని తిరిగి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారన్నారు. ఈ క్యాంపులు ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారో ముందుగానే తెలియజేస్తారన్నారు. ఆ రోజు దగ్గరుండి క్యాంపు వద్దకు తీసుకెళ్తారన్నారు. సమస్య పరిష్కారమయ్యేలా వారికి తోడుగా ఉంటారన్నారు. మండల స్థాయి అధికారులైన తహశీల్దార్, ఈఓపీఆర్డీ ఒక టీమ్ కాగా.. ఎంపీడీఓ, డిప్యూటీ తహశీల్దార్ రెండో టీమ్‌గా ఏర్పడి సచివాలయంలో ఒకరోజు పూర్తిగా గడిపేలా చూస్తారన్నారు. జూలై 1 నుంచి ప్రతి సచివాలయంలో క్యాంపు నిర్వహించి అక్కడికక్కడే పథకాల సమస్యలను పరిష్కరించడంతో పాటు సేవా చార్జీలు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లను అందిస్తారన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, లాండ్ మ్యుటేషన్లు, ఫోన్ నంబర్‌కు ఆధార్ అనుసంధానం, పంట సాగు కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా జారీతో పాటు మరే ఇతర అవసరమైన సర్టిఫికెట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో అందిస్తుందన్నారు.

# వెనుకబడిన వర్గాలను చిన్న చూపు చూస్తున్నా ప్రభుత్వాలు

నల్లగొండ జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బీ.సీ.లు, మైనారిటీలు, రాజకీయంగా, సామాజికంగా, వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని బీ.సీ. సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖదీర్ అన్నారు.కేంద్ర ప్రభుత్వం చట్ట సభలోబీ.సీ.లకు , మైనార్టీలకు ప్రాధాన్యతను కల్పించారు. రాష్ట్ర జాబితాలో ఉన్నటువంటి కులాల పేర్లను కాకుండా కేంద్ర జాబితాలో లేని పేర్లను ఓ.బీ.సీ .జాబితాలో కలపాలన్నారు. బీ.సీ.లకు మైనారిటీలకు, సంక్షేమ పథకాలపై ప్రభుత్వాలు పెద్దపీట వేయాలన్నారు. బీ.సీ.కులాల్లో ఉన్నటువంటి దూదేకుల కులాన్ని బి.సి. ఈ. జాబితాలో చేర్పించాలన్నారు దూదేకుల కులం లో ఆర్థికంగా సామాజికంగా, రాజకీయ రంగంలో వెనుకబడి ఉన్నారు. అంతే కాకుండా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకున్నటువంటి విద్యార్థులకు అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు యాజమాన్యం పై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులచే విద్య బోధన చేయించి విద్య యొక్క ప్రావీణ్యతను పెంచాలని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాన్ని కోరారు. బీ.సీ.కులాలకు లక్ష రూపాయల కులవృత్తుల సహాయం తేదీని పొడిగించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ కు విజ్ఞప్తి చేసారు.

# 25 న తెలంగాణలో తొలగించబడిన 26 బీసీ కులాల ఆత్మ గౌరవ సభ



హైదరాబాద్ జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తొలగించిన 26 బిసి కులాలను వెంటనే కలపాలని, బిసి కమిషన్ సుప్రీంకోర్టు కు అనుకూల నివేదిక సమర్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ లో తొలగించిన 26 బీసీ కులాల పోరాట సమితి ఆధ్వర్యం లో బీసీ కులాల ఆత్మగౌరవ సభ సికింద్రాబాద్ తిరుమలగిరిలో సూర్య టెంపుల్ ప్రక్కన గౌరీ భవనంలో 25న నిర్వహిస్తున్నట్లు తొలగించిన 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ళ రామ కృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆత్మ గౌరవ సభ పోస్టర్ ను పోరాట సమితి నేతలు శుక్రవారం ఆవిష్కరించారు. రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అధ్యక్షతన జరిగే ఈ సభకు తెలంగాణలోని ప్రతిపక్ష నాయకులు రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కాసాని జ్ఞానేశ్వర్, శ్రీమతి షర్మిల, ఉభయ కమ్యూనిస్టు పార్టీల కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు మరియు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో పాటు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ హాజరవుతున్నారు. కావున వివిధ, బీసీ సంఘాలు, రాజకీయ పక్షాల నాయకులు, అశేష బీసీ జనాలు సభకు హాజరుకావాలని తెలంగాణ తొలగించిన 26 బిసి కులాల పోరాట సమితి మరియు శ్రీ గౌరీ సంఘం నాయకులు కోరారు.

# ముఖ గుర్తింపు సౌకర్యంతో అభివృద్ధి చేసిన పీఎం కిసాన్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన శ్రీ నరేంద్ర సింగ్ తోమర్

న్యూఢిల్లీ, జూన్ 23:ముఖ గుర్తింపు సౌకర్యంతో అభివృద్ధి చేసిన పీఎం కిసాన్ మొబైల్ యాప్‌ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ ఆవిష్కరించారు. రైతుల ఆదాయం ఎక్కువ చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి" పథకం కింద ముఖ గుర్తింపు సౌకర్యంతో పీఎం -కిసాన్ మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి యాప్ ను అభివృద్ధి చేశారు. ఈ యాన్ ను ఉపయోగించి మారు మూల ప్రాంతాల్లో నివసిస్తున్న రైతులు ఓటీపీ లేదా వేలిముద్ర లేకుండా ముఖం స్కాన్ చేయడం ద్వారా సులభంగా ఇంటి వద్ద కూర్చొని ఈ -కేవైసీ సౌకర్యం పొందడానికి వీలవుతుంది. 100 మంది రైతులు తమ ఇంటి వద్ద ఇ-కెవైసి సౌకర్యం పొందారు. ఇ-కెవైసి ని తప్పనిసరి చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇ-కెవైసి అందించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాల అధికారులకు కల్పించింది. ఒక అధికారి 500 మంది రైతులకు ఈ -కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి వీలవుతుంది.

న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో జరిగిన యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాల నుంచి వేలాది మంది రైతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు , వివిధ ప్రభుత్వ సంస్థలు, వ్యవసాయ సంస్థల ప్రతినిధులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. . ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ తోమర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కార్యక్రమంగా అమలు చేస్తున్నదని అన్నారు. పథకాన్ని విజయవంతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు పాత్ర నిర్వర్తించాయని అన్నారు. దీనివల్ల కెవైసీ తర్వాత దాదాపు 8.5 కోట్ల మంది రైతులు పథకం వాయిదాలు పొందారని తెలిపారు. నూతన పథకం విజయవంతం పీఎం -కిసాన్ ద్వారా రైతులు నేరుగా ప్రయోజనం పొందుతారు అని అన్నారు. డేటా వెరిఫికేషన్‌లో ఎటువంటి సమస్య తలెత్తకుండా పూర్తి సమాచారం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు అందుబాటులో ఉంటుందన్నారు. .

వినూత్నంగా అమలు జరుగుతున్న పీఎం-కిసాన్ పథకం వల్ల మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రయోజనాలు నేరుగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తోంది అని శ్రీ తోమర్ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పెద్ద సంఖ్యలో రైతులకు ప్రయోజనాలు కల్పించడం సాధ్యమైందన్నారు. పథకం అమలు జరుగుతున్న తీరు పట్ల ఎటువంటి సందేహం అవసరం లేదని మంత్రి అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అభివృద్ధి చేసిన యాప్ ఉపయోగించడం ద్వారా పని చాలా సులభం గా పూర్తవుతుందన్నారు. రాష్ట్రాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చిందని తెలిపిన శ్రీ తోమర్ , రాష్ట్రాలు మరింత వేగంగా పని చేస్తే లబ్ధిదారులందరికీ కేంద్రం కల్పిస్తున్న ప్రయోజనాలు అందుతాయన్నారు.

పథకం అమలుకు అవసరమైన నిధులు అందుబాటులో ఉంచి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చూడాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆదేశాలు జారీ చేశారని శ్రీ తోమర్ తెలిపారు. . ఉత్తరప్రదేశ్‌తో సహా ఇతర రాష్ట్రాల్లో ఈ దిశలో పని జరుగుతోందన్నారు.దీనివల్ల గరిష్ట సంఖ్యలో అర్హులైన రైతులు పథకం 14వ విడత ప్రయోజనం పొందుతారని మంత్రి వివరించారు. ఈ విషయంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని శ్రీ తోమర్ కోరారు.

కేంద్ర వ్యవసాయ,రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ కైలాష్ చౌదరి మాట్లాడుతూ వ్యవసాయ రంగం సాంకేతికతతో లాభపడుతుంది అని అన్నారు. యాప్ లో పొందుపరిచిన కొత్త సదుపాయం రైతులకు సౌకర్యాన్ని కల్పిస్తుందని అన్నారు. కేంద్ర వ్యవసాయ కార్యదర్శి శ్రీ మనోజ్ అహుజా అదనపు కార్యదర్శి శ్రీ ప్రమోద్ కుమార్ మెహ్రోడా యాప్ విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంటల్ అడ్వైజర్ శ్రీ మనోజ్ కుమార్ గుప్తా సమన్వయం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు పథకం, యాప్ ప్రయోజనాలకు సంబంధించి తమ అనుభవాలను తెలిపారు. యువత ద్వారా మరింత ఎక్కువ మంది రైతులను యాప్‌తో అనుసంధానం చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతాయి. నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా, సహాయపడే యువతకు వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ద్వారా ధృవ పత్రాలు అందిస్తారు.

ప్రపంచంలో భారీ స్థాయిలో అమలు జరుగుతున్న డీబీటీ పథకాలలో పీఎం కిసాన్ ఒకటి. దీని కింద రైతులు ఆధార్ అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాల ద్వారా సంవత్సరానికి మూడు విడతలుగా రూ. 6,000 నేరుగా బదిలీ అవుతాయి. . 2.42 లక్షల కోట్ల రూపాయలు 11 కోట్ల మందికి పైగా రైతుల ఖాతాలకు బదిలీ అయ్యాయి. లబ్ధి పొందిన వారిలో 3 కోట్ల మందికి పైగా మహిళలు ఉన్నారు. కోవిడ్ సందర్భంగా లాక్ డౌన్ విధించిన సమయంలో కూడా ప్రధానమంత్రి కిసాన్ యోజన రైతులకు అండగా నిలిచింది. ఈ పథకం రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించడం ద్వారా అవసరమైన సౌకర్యాలు అందిస్తుంది.. ఇప్పుడు పీఎం కిసాన్ పోర్టల్‌లో ఆధార్ ధృవీకరణ, బ్యాంక్ ఖాతా వివరాల నవీకరణ అంశాలకు సంబంధించి ఎదురైన సమస్యలు ఇబ్బందులు డిజిటల్ విధానం ద్వారా పరిష్కారం అయ్యాయి.

మొదటిసారిగా 8.1 కోట్ల మందికి పైగా రైతులకు పీఎం కిసాన్ 13వ విడత ను నేరుగా ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానం ద్వారా బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేశారు.. కొత్త యాప్ ఉపయోగించడానికి సులభంగా ఉంటుంది. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా దీనిని సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పథకం, పీఎం కిసాన్ ఖాతాలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్నిఈ యాప్ రైతులకు అందిస్తుంది. దీనిలో, రైతులు నో యూసర్ స్టేటస్ మాడ్యూల్‌ని ఉపయోగించి భూసేకరణ స్థితి, బ్యాంకు ఖాతాలతో ఆధార్‌ను లింక్, మరియు ఇ-కెవైసి వివరాలు తెలుసుకోవచ్చు. డిపార్ట్‌మెంట్ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఎఖఖః)లో కూడా లబ్ధిదారుల కోసం ఆధార్ లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాలను వారి ఇంటి వద్ద తెరవడానికిచర్యలు అమలు చేస్తుంది. రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల సహాయంతో గ్రామ స్థాయి ఇ-కెవైసి క్యాంపులను నిర్వహించాలని సిఎస్‌సిలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు జారీ చేసింది.

# బాలవికాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవ వేడుకలు

ఖమ్మం, జూన్ 23:(నేటినిజం ప్రతినిధి): కొనిజర్లమండలం చిన్నగోపతి గ్రామంలో శుక్రవారంరోజు అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించడం జరిగింది. జూన్23వ తేదీన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధికారిక అంతర్జాతీయ వితంతువుల దినోత్సవంగా2010 డిసెంబర్లో ప్రకటించి లక్షలాదిమంది వితంతువులు ఎదుర్కొంటున్న పేదరికం, అన్యాయాన్ని పరిష్కరించడానికి కేటాయించిన ప్రత్యేకమైన రోజు ఇది ప్రపంచంలో258మిలియన్ల వితంతువులు ఉంటే కేవలం భారత దేశంలోనే40 మిలియన్లకు పైగా ఉన్నారని గ్లోబల్ విడోస్ రిపోర్టు 2015చెబుతోంది కోవిడ్19మహమ్మారి కారణంగా వారి సంఖ్య బాగా పెరిగింది. ప్రపంచం మొత్తంలో భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో వితంతువులు ఉన్నారు. దీని తర్వాత చైనా రెండవ స్థానంలో ఉంది ఇంత పెద్ద సంఖ్యలో వితంతువులు నివసిస్తున్న మనదేశంలో సమాజం వారిపట్ల ఎలా వ్యవహరిస్తుందనేది చాలా ముఖ్యం. ఆలోచించాల్సిన విషయం అని బాలవికాస్ కోఆర్డినేటర్ పిజె ప్రసాద్ మొటాటి అన్నారు. గ్రామంలో ఉన్న వితంతువులు మూడ ఆచారాల




పేరుమీద తాము అనుభవిస్తున్న బాధల గురించి వివరించి కన్నీరు మున్నీరయ్యా రు.ఈ సమావేశంలో ఎంపీటీసీ బూర ప్రసాదరావు, ఉపాధ్యాయులు మేకల శ్రీనివాసరావు, పారాలీగల్ వాలంటీర్ కోయిన్ని శంకర్రావు,మాట్లాడుతూ... వితంతువులను కాపాడాలి వారికి సమాజంలో సమాన హక్కులు కల్పించాలి. ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన విధముగా నూతన ఆవిష్కరణలు, సాంకేతికతతో లింగ సమానత్వంతో వారిని సమానంగా గౌరవించాలని అంతర్జాతీయ వితంతువుల దినోత్సవ సందర్భంగా వితంతువుల ఎడల జరుగుతున్న వివక్షతను రూపుమాపుటకై అవగాహన మీటింగులు ఏర్పాటు చేసి ర్యాలీలు నిర్వహించడం జరుగుతుంది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు మాజీ సర్పంచ్ పొట్లపల్లి పెద్ద జీడయ్య, స్కూల్ చైర్మన్ బుర్రి గీత, మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, వార్డ్ నెంబర్ వీరస్వామి, గ్రామపెద్దలు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



# ఏజెన్సీ ప్రాంతాల జాతులకు ప్రత్యేక ప్రయోజనాలకై సిఫారసు చేయండి

## -రాష్ట్ర బీసీ కమిషన్‌తో భేటీ అయిన సినీ నటుడు సుమన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం



హైదరాబాద్ జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలలో నివాసముంటున్న బీసీ వర్గాల లోని సంచార, అర్ధ సంచార, విముక్త కులాలు, జాతుల ప్రజలను ప్రత్యేకంగా గుర్తించి వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు నిర్మాణాత్మకంగా, నిర్దిష్టంగా సూచనలను ప్రభుత్వానికి ఇవ్వాలని సినీ నటుడు సుమన్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర బీసీ కమిషన్ తో భేటీ అయి కోరింది. ఈ నేపథ్యంగా, ఈ ప్రతినిధి బృందం కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, సభ్యులు, సి. హెచ్. ఉపేంద్ర, కె. కిశోర్ గౌడ్ లతో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలను కమిషన్ దృష్టికి తెచ్చారు. ఈ భేటీ శుక్రవారం నాడు నగరం లోని ఖైరతాబాద్ లో గల తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం ఛాంబర్స్ లో జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలు బీసీ వర్గాలకు ఎంతగానో చేయూతను అందిస్తున్నాయని సుమన్ కితాబు ఇచ్చారు. కాగా ఏజెన్సీ ప్రాంతాలలో నివసిస్తున్న విముక్త, సంచార, అర్ధ సంచార కులాలు, జాతుల ప్రజలకు చైతన్య రహితం కారణంగా వాటిని పూర్తి స్థాయిలో అందుకోలేక పోతున్నారని కమిషన్ కు వివరించారు. ఇలాంటి జాతులు, కులాల ప్రజల వాస్తవ జీవన స్థితిగతులను సమగ్రంగా అధ్యయనం చేయాలని కోరారు. కొన్ని ప్రాంతాలలో వోటర్ కార్డు, ఆధార్ కార్డు లాంటి ప్రయోజనాలను కూడా స్థిర నివాసులుగా లేని కారణంగా పొందలేక పోతున్నారని కమిషన్ కు తెలిపారు. ప్రధానంగా రాష్ట్ర బీసీ జాబితాలోని ౦-గ్రూప్ లో గల సంచార, విముక్త కులాల నిమిత్తం ప్రత్యేక అధ్యయనం నిర్వహించి, వారి జీవితాలలో ప్రభుత్వం వెలుగులు నింపే దిశగా రాష్ట్ర బీసీ కమిషన్ సిఫారసులు ఉండాలని ఆయన కోరారు. ఈ భేటీ సుమారు ఒక గంట పాటు కొనసాగింది. సుదీర్ఘంగా వివిధ కులాల సమాచారాన్ని ఉటంకిస్తూ చర్చించడం జరిగింది. ఆయనతో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొన్నారు.

# టైమ్ ఆఫ్ డే (టిఒడి) టారిఫ్ మరియు స్మార్ట్ మీటరింగ్ నియమాలను సరళీకృతం చేయడం ద్వారా నిబంధనలను సవరించింది.

న్యూఢిల్లీ, జూన్ 23:విద్యుత్ (వినియోగదారుల హక్కులు) నియమాలు, 2020కి సవరణ చేయడం ద్వారా భారత ప్రభుత్వం ప్రస్తుత విద్యుత్ టారిఫ్ వ్యవస్థకు రెండు మార్పులను ప్రవేశపెట్టింది. మార్పులు: టైమ్ ఆఫ్ డే (టిఒడి) టారిఫ్‌ను ప్రవేశపెట్టడం మరియు స్మార్ట్ మీటరింగ్ నిబంధనలను హేతుబద్ధీకరించడం.

రోజులో అన్ని సమయాల్లో ఒకే రేటుతో విద్యుత్ ఛార్జీ విధించే బదులు విద్యుత్ కోసం చెల్లించే ధర రోజులో సమయాన్ని బట్టి మారుతుంది. టిఒడి టారిఫ్ విధానంలో సౌర గంటలలో సుంకం (రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంఘం ద్వారా నిర్దేశించబడిన రోజులో ఎనిమిది గంటల వ్యవధి) సాధారణ టారిఫ్ కంటే 10%-20% తక్కువగా ఉంటుంది, అయితే పీక్ అవర్స్‌లో సుంకం ఉంటుంది 10 నుంచి 20 శాతం ఎక్కువగా ఉంటుంది. టిఒడి టారిఫ్ గరిష్టంగా 10 కెడబ్ల్యూ మరియు అంతకంటే ఎక్కువ డిమాండ్ ఉన్న వాణిజ్య మరియు పారిశ్రామిక వినియోగదారులకు, 1 ఏప్రిల్, 2024 నుండి మరియు వ్యవసాయ వినియోగదారులకు మినహా మిగిలిన వినియోగదారులందరికీ, 1 ఏప్రిల్, 2025 నుండి వర్తిస్తుంది. స్మార్ట్ మీటర్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన వెంటనే రోజు టారిఫ్ అమలులోకి వస్తుంది.

కేంద్ర విద్యుత్ మరియు నూతన ఉ పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీ ఆర్. కె. సింగ్ మాట్లాడుతూ టిఒడి వినియోగదారులతో పాటు విద్యుత్ వ్యవస్థకు ఇది ఉభయ తారకం అని అన్నారు. " పీక్ అవర్స్, సోలార్ అవర్స్ మరియు సాధారణ గంటల కోసం ప్రత్యేక టారిఫ్‌లతో కూడిన టిఒడి టారిఫ్‌లు, టారిఫ్ ప్రకారం తమ లోడ్‌ను నిర్వహించడానికి వినియోగదారులకు ధర సంకేతాలను పంపుతాయి. టిఒడి టారిఫ్ మెకానిజంపై అవగాహన మరియు సమర్ధవంతమైన వినియోగంతో వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చు. సౌర విద్యుత్తు చౌకైనందున, సౌర గంటలలో సుంకం తక్కువగా ఉంటుంది, తద్వారా వినియోగదారు ప్రయోజనం పొందుతారు. సౌర శక్తి లేని సమయాల్లో థర్మల్ మరియు హైడ్రో పవర్ అలాగే గ్యాస్ ఆధారిత సామర్థ్యం ఉపయోగించబడుతుంది - వాటి ఖర్చులు సౌర శక్తి కంటే ఎక్కువగా ఉంటాయి - ఇది టైమ్ ఆఫ్ డే టారిఫ్‌లో ప్రతిబింబిస్తుంది. ఇప్పుడు వినియోగదారులు తమ విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడానికి తమ వినియోగాన్ని ప్లాన్ చేసుకోవచ్చు - విద్యుత్ ఖర్చులు తక్కువగా ఉన్నప్పుడు సౌర గంటలలో మరిన్ని కార్యకలాపాలను ప్లాన్ చేసుకోవచ్చు.

పునరుత్పాదక ఇంధన వనరుల మెరుగైన గ్రిడ్ ఏకీకరణను కూడా టీఓడీ యంత్రాంగం నిర్ధారిస్తుంది, తద్వారా భారతదేశానికి వేగవంతమైన ఇంధన పరివర్తనను సులభతరం చేస్తుందని కేంద్ర మంత్రి చెప్పారు. "టిఒడి టారిఫ్ పునరుత్పాదక ఉత్పత్తి హెచ్చుతగ్గుల నిర్వహణను మెరుగుపరుస్తుంది, అధిక ఆర్ఈ ఉత్పత్తి సమయాలలో డిమాండ్ పెరుగుదలను ప్రోత్సహిస్తుంది మరియు తద్వారా పెద్ద మొత్తంలో పునరుత్పాదక శక్తి యొక్క గ్రిడ్ ఏకీకరణను పెంచుతుంది" అని శ్రీ ఆర్. కె. సింగ్ చెప్పారు.

దేశంలోని భారీ వాణిజ్య మరియు పారిశ్రామిక (సిఅఇ) కేటగిరీ వినియోగదారుల కోసం చాలా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్‌లు (ఎస్ఈఆర్‌సిలు) ఇప్పటికే టిఒడి టారిఫ్‌లను అమలు చేస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల ఇన్‌స్టాలేషన్‌తో టారిఫ్ పాలసీ ఆదేశం ప్రకారం దేశీయ వినియోగదారుల స్థాయిలో టిఒడి మీటరింగ్ ప్రవేశపెట్టబడుతుంది.

టైమ్ ఆఫ్ డే (టిఒడి) టారిఫ్, విద్యుత్ పరిశ్రమల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడింది, ఇది ఒక ముఖ్యమైన డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్ (డిఎస్ఎం) కొలతగా వినియోగదారులను వారి లోడ్‌లలో కొంత భాగాన్ని పీక్ టైమ్‌ల నుండి ఆఫ్-పీక్ టైమ్‌లకు మార్చడానికి ప్రోత్సహించే సాధనంగా ఉపయోగించబడుతుంది, తద్వారా పీక్ పీరియడ్‌లో సిస్టమ్‌పై డిమాండ్‌ని తగ్గించడం ద్వారా సిస్టమ్ లోడ్ ఫ్యాక్టర్‌ను మెరుగుపరుస్తుంది. టిఒడి టారిఫ్ (అంటే టారిఫ్ పాలసీ, 2016, ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2003 మరియు నేషనల్ ఎలక్ట్రిసిటీ పాలసీ, 2005) అమలును ప్రారంభించడానికి మరియు ప్రోత్సహించడానికి వివిధ చట్టబద్ధమైన నిబంధనలు ఇప్పటికే ఉన్నాయి.

స్మార్ట్ మీటరింగ్ నిబంధనలను కూడా ప్రభుత్వం సరళతరం చేసింది. వినియోగదారులకు అసౌకర్యం / వేధింపులను నివారించడానికి, గరిష్టంగా మంజూరైన లోడ్ / డిమాండ్‌కు మించి వినియోగదారుడి డిమాండ్‌ను పెంచినందుకు ప్రస్తుతం ఉన్న జరిమానాలు తగ్గించబడ్డాయి. మీటరింగ్ నిబంధనలో సవరణ ప్రకారం, స్మార్ట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత, ఇన్‌స్టాలేషన్ తేదీకి ముందు కాలానికి స్మార్ట్ మీటర్ నమోదు చేసిన గరిష్ట డిమాండ్ ఆధారంగా వినియోగదారుపై ఎటువంటి జరిమానా ఛార్జీలు విధించబడవు. ఒక ఆర్థిక సంవత్సరం లో కనీసం మూడు సార్లు మంజూరైన లోడ్‌ను అధిగమించినట్లయితే మాత్రమే గరిష్ట డిమాండ్ పైకి సవరించబడే విధంగా లోడ్ రివిజన్ విధానం కూడా హేతుబద్ధీకరించబడింది. అంతేకాకుండా, స్మార్ట్ మీటర్‌లను కనీసం రోజుకు ఒకసారి రిమోట్‌గా చదవాలి మరియు విద్యుత్ వినియోగం గురించి సమాచారం తీసుకునే నిర్ణయం తీసుకునేలా వినియోగదారులతో డేటాను షేర్ చేయాలి.

వినియోగదారులకు సేవ చేయడానికి ఇఎంఎస్ ఉనికిలో ఉంది మరియు వినియోగదారులకు నమ్మకమైన సేవలు మరియు నాణ్యమైన విద్యుత్తును పొందే హక్కులు ఉన్నాయి. కొత్త విద్యుత్ కనెక్షన్లు, రీఫండ్‌లు మరియు ఇతర సేవలను సమయానుకూలంగా అందించాలని మరియు వినియోగదారుల హక్కులను ఉద్దేశపూర్వకంగా విస్మరించడం వల్ల సర్వీస్ ప్రొవైడర్లపై జరిమానాలు విధించడం మరియు వినియోగదారులకు పరిహారం చెల్లింపు జరిగేలా నిబంధనలు కోరుతున్నాయి.

ప్రస్తుత నిబంధనల సవరణ, విద్యుత్ వినియోగదారులకు సాధికారత కల్పించడం, అందుబాటు ధరలో 24చీ7 నమ్మకమైన విద్యుత్ సరఫరాను నిర్ధారించడం మరియు విద్యుత్ రంగంలో పెట్టుబడులకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను నిర్వహించడం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యల కొనసాగింపు ఉంటుంది.

# తిరుమలలో బాలుడిపై చిరుత దాడి.. కీలక నిర్ణయాలు తీసుకున్న టీటీడీ

తిరుపతి, జూన్ 23: తిరుమలలో ఐదేండ్ల చిన్నారిపై చిరుత దాడితో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అప్రమత్తమైంది. అలిపిరి నడక మార్గంలో భద్రత పెంచాలని నిర్ణయం తీసుకుంది. చిరుతను పట్టుకునేందుకు గాలిగోపురం నుంచి ఏడో మైలు వరకు 30 కెమెరా ట్రాన్స్‌లు ఏర్పాటు చేశారు. రెండు చోట్ల బోన్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. వీటితోపాటు జంతువులు తిరిగే చోట ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని టీటీడీ యోచిస్తోంది.

తిరుమలలో శుక్రవారం సాయంత్రం చిరుత దాడిలో గాయపడ్డ బాలుడు కౌశిక్‌ను టీటీడీ ఈవో ధర్మారెడ్డి పరామర్శించారు. అనంతరం చిరుత దాడి చేసి ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దాడి చేసింది చిరుత పిల్ల కావడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. దాడి జరిగిన సమయంలో భక్తులు పెద్దగా అరవడం, రిపీటర్ స్టేషన్ నుంచి లైట్లు వేయడంతో చిరుత ఆ పిల్లాడిని వదిలేసి వెళ్లిందని పేర్కొన్నారు. చిరుత దాడి నేపథ్యంలో రాత్రి 7 గంటల తర్వాత గాలిగోపురం నుంచి 200 మంది భక్తులను ఒక బృందంగా కలిపి పంపించేలా ఏర్పాటు చేశామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. వీరితో పాటు సెక్యూరిటీ గార్డు ఉంటారని అన్నారు. చిన్న పిల్లలు బృందం మధ్యలో ఉండేలా చూసుకోవాలని.. అప్రమత్తంగా ఉండాలని భక్తులకు సూచించారు. శ్రీవారి మెట్టు మార్గంలో సాయంత్రం 6 గంటల వరకు, అలిపిరి నడక మార్గంలో రాత్రి 10 గంటల వరకు భక్తులను అనుమతిస్తామని తెలిపారు.






# బీజేపీని ఐక్యంగా ఎదుర్కొంటాం.. విపక్షాల భేటీ తర్వాత నితీశ్‌కుమార్ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 23:రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ కలిసి కూటమిగా పోటీ చేస్తాయని బిహార్ సీఎం, జనతాదళ్-యునైటెడ్ అధినేత నితీష్ కుమార్ చెప్పారు. ఇవ్వాల (శుక్రవారం) పాట్నాలో ప్రతిపక్ష పార్టీల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కలిసి ఎన్నికల్లో పోరాడాలని నిర్ణయించుకున్నట్లు నితీశ్ వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీల మెగా మీటింగ్‌ను ఏర్పాటు చేసిన నితీశ్‌కుమార్.. త్వరలో మరో విపక్షాల భేటీ ఉంటుందన్నారు.

ఇది మంచి సమావేశం, ఇక్కడ కలిసి ఎన్నికల్లో పోరాడాలని నిర్ణయించుకున్నాం. త్వరలో మరో సమావేశం జరగనుంది అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ముఖ్యనేత రాహుల్ గాంధీ సహ ఇతర ప్రతిపక్ష నేతల సమక్షంలో జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో నితీశ్ కుమార్ తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పనితీరును కూడా ఆయన దుయ్యబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి విపక్షాల ఐక్యత కోసం ఈ సమావేశం జరిగింది.

# శివసేన నేత ఉద్ధవ్ థాక్రేపై విరుచుకుపడ్డ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

పాట్నా జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);పాట్నాలో విపక్షాల ఐక్యత సమావేశం జరుగుతుండగా..శివసేన (యూబీటీ)నేత ఉద్ధవ్ థాక్రేపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా విరుచుకు పడ్డారు. విపక్ష పార్టీల సమావేశంలో ఉద్ధవ్ పాల్గొనడంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సమయంలో బాలా సాహెబ్ బతికి ఉంటే ఎంతో బాధపడేవారని.. తన సొంత కొడుకే శివసేన దుకాణాన్ని మూసివేయడంపై బాలాసాహెబ్ ఆత్మ ఘోషిస్తుందని ఆయన ఎద్దేవా చేశారు.

"శివసేనను ఎప్పుడు కాంగ్రెస్‌తో కలపడం అనేది జరగదని.. ఒకవేళ అలాంటి పరిస్థితే వస్తే.. నేను శివసేన దుకాణం మూసివేస్తానని "ఉద్ధవ్ థాక్రే తండ్రి బాలాసాహెబ్ థాక్రే చెప్పేవారని నడ్డా తెలిపారు. ఇవాళ బాలా సాహెబ్ సొంత కొడుకు శివసేన దుకాణం మూసివేయాలని చూస్తున్నాడని నడ్డా విమర్శించారు.

మరోవైపు కాంగ్రెస్‌తో కలిసి విపక్షాల మీటింగ్‌లో బీహార్ సీఎం నితీష్‌కుమార్, ఆర్జేడీనేతలు పాల్గొనడంపై నడ్డా తప్పుబట్టారు. ఒడిశా కలహండి బహిరంగ సభలో నడ్డా మాట్లాడుతూ.. ఈరోజు రాజకీయాల్లో విచిత్రాలు జరుగుతున్నాయన్నారు. ఎమర్జెన్సీ టైంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కారణంగా జైలుకెళ్లిన నేతలు.. ఇప్పుడు ఆమె మనవడు రాహుల్ గాంధీతో చేతులు కలిపారు. లాలూ ప్రసాద్ యాదవ్‌కు 22 నెలలు జైలు శిక్ష విధించగా, నీతిష్‌కుమార్ 20 నెలల పాటు కటకటాల వెనక్కి వెళ్లాడని నడ్డా తెలిపారు.

ఉద్ధవ్ థాక్రే తండ్రి బాలా సాహెబ్ థాక్రే ఎప్పుడు కాంగ్రెస్‌ను విమర్శించేవాడని.. హిందూ హృదయ సామ్రాట్ అయిన బాలా సాహెబ్ కాంగ్రెస్‌ను అంతటా వ్యతిరేకించే వాడని నడ్డా అన్నారు. ఒకవేళ కాంగ్రెస్‌తో కలిసే పరిస్థితి వస్తే తాను దుకాణం మూసివేస్తానని బాలాసాహెబ్ చెప్పేవాడని నడ్డా తెలిపాడు. ఇప్పుడు ఆయన కొడుకు దుకాణం మూసేస్తున్నాడు అని ఆయన విమర్శించారు.

ప్రధాని నరేంద్ర మోదీని ప్రపంచ నేతలు ప్రశంసించడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని నడ్డా ఆరోపించారు. కుటుంబ రాజకీయాలను మోదీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, దేశంలో అభివృద్ధి రాజకీయాలను ప్రవేశపెట్టారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా అన్నారు.

# ప్రధాన రహదారి రోడ్డు ప్రమాదం.. గ్రామస్తుల నిరసన..

వరంగల్, జూన్ 23:సైకిల్ పై వెళ్తున్న ఓ వ్యక్తిని కాలేజ్ బస్ ఢీకొట్టగా అతడికి తీవ్ర గాయాలయ్యాయి.. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ వైపు నుంచి వెళ్తున్న ఓ ప్రైవేట్ కళాశాల బస్సు గీసుగొండ మండలం మచ్చాపూర్ హర్జ్యా తండా వద్ద సైకిల్ పై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు కళాశాల బస్సులను నిలిపివేశారు. దీంతో గంటపాటు వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా ఈ రోడ్డుపై తరచూ ఇలాంటి ఘటనలు చాలా జరుగుతున్నాయని, పట్టించుకునే వారే లేరని వాపోయారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# రంగారెడ్డి సిగలో.. మరో మణిహారం

హైదరాబాద్, జూన్ 23 తెలంగాణ రాష్ట్రం ఆవిష్కరించినప్పటి నుంచి పారిశ్రామిక పెట్టుబడుల్లో రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా అగ్రగామిగా నిలుస్తూ వస్తుంది. పెద్ద పెద్ద కంపెనీలు రంగారెడ్డి జిల్లా ప్రాంతానికి క్యూ కడుతున్నాయి. దేశంలోనే అతి పెద్ద ప్రైవేట్ రైల్ కోచ్ ఫ్యాక్టరీల్లో ఒకటైన మేధా సంస్థ కొండకల్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా గురువారం ఫ్యాక్టరీని ప్రారంభించుకుంది. టీఎస్ ఐ పాస్‌తో పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇవ్వడం, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం వంటి చర్యల మూలంగా జిల్లాలో పారిశ్రామిక రంగం పరుగులు పెడుతోంది. ఈ అభిప్రాయాల్ని పారిశ్రామిక రంగ నిపుణులు తెలంగాణ సిద్ధించినప్పటి నుంచి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలంటే పారిశ్రామిక వేత్తలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. దరఖాస్తు చేసిన నాటి నుంచి అనుమతులు వచ్చే వరకు చెప్పులరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఉండేది. స్వరాష్ట్రం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను సులభతరం చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. దీంతో రాష్ట్రంలోనే కాదు రంగారెడ్డి జిల్లాలోనూ పారిశ్రామిక విజయం సాధ్యమైంది.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రోడ్ల విస్తరణ జరగడం, తగినంత మ్యాన్ పవర్ లభిస్తుండటం, పరిశ్రమలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుండటం, నీటి వనరులు అందుబాటులోకి రావడం, భూగర్భ జలాలు దండిగా ఉండటం వంటి అంశాలు పారిశ్రామిక వేత్తలను ఆకర్షిస్తున్నాయి. మార్కెటింగ్, రవాణాకు ఈ ప్రాంతం అనువుగా ఉంది. గోదాములు, కోల్డ్ స్టోరేజీలు, రైస్ మిల్లులు, సీడ్ ప్రాసెసింగ్, టీవీ, మొబైల్స్ తయారీ, ప్యాకింగ్ కంపెనీ వంటి యూనిట్లు నెలకొల్పేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా మైక్రో సాఫ్ట్, గూగుల్, బోయింగ్, విప్రో, ఫాక్స్ కాన్ వంటి దిగ్గజ సంస్థలు అనేకం రంగారెడ్డి జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి.

### యువతకు ఉపాధి లభించనుంది..

హైదరాబాద్ మహా నగరానికి శంకర్‌పల్లి మండలం దగ్గర్లో ఉన్నప్పటికీ అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం జీవో 111ను రద్దు చేయడంతో ఇక్కడ పెద్ద పెద్ద కంపెనీలు రానున్నాయి. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించడం సంతోషకరం.

కొత్త రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం సహకారం లేకుండా తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్ కృషి మరువలేనిది. రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సాహిస్తూ, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫ్యాక్టరీలకు అండగా నిలుస్తూ పారిశ్రామిక అభివృద్ధికి కేసీఆర్ తోడ్పాటును అందిస్తున్నారు. కొత్తగా పెట్టుబడులను ప్రోత్సాహించడం ద్వారా నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుంది. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలవాలి.

### సీఎం చొరవతోనే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సీఎం కేసీఆర్ చొరవతోనే ఏర్పడింది. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సాహిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ద్వారా విదేశాలకు బోగీలను ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ఎదిగిందంటే.. అది కేవలం సీఎం కేసీఆర్ పరిపాలన వల్లే సాధ్యపడింది. రాష్ట్రం మరింత పురోగతి సాధించాలంటే కేసీఆర్ ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన భాధ్యత అందరిపైనా ఉంది. ? రాజు నాయక్, మోకిల గ్రామం

# ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని విపక్షాల ఐక్య కూటమి

## -మొదటి సమావేశం ఫలప్రదం

## - త్వరలోనే మరో సమావేశం ఏర్పాటు: నితీష్ కుమార్



పాట్నా జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: విపక్షాల ఐక్య కూటమి ప్రయత్నాల కోసం బిహార్ రాజధాని పాట్నాలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశం ఫలప్రదమైందని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని తామంతా నిర్ణయించామని బీహార్ ముఖ్యమంత్రి, ఐక్య కూటమి ఏర్పాటుకు సంధానకర్తగా వ్యవహరిస్తున్న జేడీయూ నేత నితీష్ కుమార్ తెలిపారు. ఆయన సారథ్యంలో పాట్నాలో ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన విపక్ష పార్టీల సమావేశం మధ్యాహ్నం 3.30 గంటల వరకూ జరిగింది. సమావేశానంతరం నితీష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ తదితరులు సంయుక్తంగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. త్వరలోనే మరో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు నితీష్ ఈ సందర్భంగా తెలిపారు.

### సిమ్లాలో మళ్లీ కలుస్తాం: ఖర్గే

విపక్షల పార్టీల తదుపరి సమావేశం సిమ్లాలో జరుగుతుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. సిమ్లా సమావేశంలో 2024 ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాల్లో కలిసికట్టుగా ఏవిధంగా పోరాడాలనే విషయంపై ఒక ఎజెండాను రూపొందిస్తామని చెప్పారు.

సిద్ధాంతాల మధ్య పోరు ఇది: రాహుల్

ఇది సిద్ధాంతాల మధ్య పోరు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నిజానికి, తమలో విభేదాలు ఉన్నప్పటికీ కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించుకున్నామని, సిద్ధాంతాలపై పరస్పరం చర్చించుకుని వాటిని పరిరక్షించుకునేందుకు కృషిచేయాలని నిర్ణయించామని చెప్పారు. దేశపునాదులపై బీజేపీ దాడి చేస్తోందని, ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడితేనే దేశాన్ని రక్షించుకోవచ్చని అన్నారు.

### కలిసే ఉన్నాం..కలిసికట్టుగా పోటీ చేస్తాం: మమత

విపక్షాలన్నీ కలిసికట్టుగా ఉన్నాయని, కలిసికట్టుగానే ఎన్నికల్లో పోరాడతాయని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిమమతా బెనర్జీ చెప్పారు. ఇక్కడ (బీహార్) నుంచే చరిత్ర ప్రారంభమైందని, హిస్టరీని మార్చాలని బీజేపీ కోరుకుంటోందని అన్నారు. బీహార్ నుంచే చరిత్రను కాపాడాలని తాము అనుకుంటున్నట్టు చెప్పారు. ఫాసిస్ట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం వినిపించడమే తమ లక్ష్యమని చెప్పారు.

జమ్మూకశ్మీర్‌కు చేరని ప్రజాస్వామ్యం: ఒమర్ అబ్దుల్లా

అతలాకుతలమైన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు, తిరిగి ప్రజాస్వామ్యాన్ని పాదుకొలిపేందుకు విపక్ష పార్టీలన్నీ పాట్నాలో సమావేశమైనట్టు నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ప్రజాస్వామ్యం హత్యకు గురైన దేశంలోనే తాను, మెహబూబా ముఫ్తీ ఉన్నామని అన్నారు. ప్రజాస్వామ్యంపై అమెరికాలో గురువారంనాడు చర్చలు జరిగాయని, జమ్మూకశ్మీర్‌కు ప్రజాస్వామ్యం ఎందుకు చేరువకాలేదని ఒమర్ ప్రశ్నించారు.

### 16 పార్టీల నేతలు హాజరు

కాగా, నితీష్ ఆధ్వర్యంలో జరిగిన విపక్షాల సమావేశంలో ఖర్గే, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, ఎంకే స్టాలిన్, హేమంత్ సోరెన్, అఖిలేష్ యాదవ్, ఉద్ధవ్ థాకరే, శరద్ పవార్, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ తదితర నేతలు పాల్గొన్నారు. తదుపరి సమావేశం మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలో సిమ్లాలో జూలై 10-12 తేదీల్లో మూడు రోజులపాటు జరిగే అవకాశం ఉంది.

# ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మాజీఎంపీ పొంగులేటి పర్యటన



ఖమ్మం, జూన్ 23:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో శుక్రవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ఖమ్మంలోని మాదగాని దుర్గా సోదరుడు మాదగాని సైదులు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయాన్ని అందజేశారు. అదేవిధంగా ఖమ్మం రూరల్ లోని తాళ్ళేసతండా గ్రామానికి చెందిన మాజీ డీసీసీ అధ్యక్షులు బానోత్ సోమ్లా నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నందున పరామర్శించి ఓదార్చారు. కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై పట్టువస్త్రాలను కానుకగా అందజేశారు.

# క్రీడలతో గుర్తింపు తెచ్చుకోవాలి

## -అల్ఫోర్స్ అధినేత డా॥ వి. నరేందర్ రెడ్డి



కరీంనగర్, జూన్ 23: (నేటినిజం ప్రతినిధి): : కరీంనగర్ పట్టణంలోని స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ మైదానంలో గురువారం అల్ఫోర్స్ ఒలంపిక్ డేను ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగాఅల్ఫోర్స్ అధినేత డా॥వి. నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడలు చాలా ప్రాచీనమైనవని, ఐక్యతకు పునాధి వేస్తుందని అన్నారు. ఒలంపిక్ క్రీడల గొప్పతనం చాలా విశిష్టమైనదని, ఎన్నో రకాలుగా లాభాలు చేకూరుస్తుందని చెప్పారు. ప్రారంభ దశలో ఒలంపిక్ క్రీడల ప్రచారానికై ఐక్యరాజ్య సమితి వారు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, చాలా విశ్రుతంగా ప్రచారం చేయడంతో పాటు వివిధ దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగింపడానికై పలు రకాలుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. నేటికి ఈ కార్యక్రమాలు రెట్టింపు ఉత్సాహంతో ప్రతి నాల్గు సంవత్సరాలకొకసారి ఒలంపిక్ క్రీడలను విశేషంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. భారతదేశంలో ఒలంపిక్ క్రీడలకు చాలా ఆసక్తి ప్రదర్శిస్తారని, వాటిలో పాల్గొనడం ఔత్సాహికుల చతురతతో ముడిపడి ఉన్నదని చెప్పారు. భారతదేశంలోని పలుగురు క్రీడాకారులు ఒలంపిక్స్లో పథకాలను విశేషంగా కైవసం చేసుకోవడంతో పాటు భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను నలు దిక్కుల వ్యాపింప చేశారని అన్నారు. ప్రతిఒక్కరు విధిగా వివిధ క్రీడలలో పాల్గొని, మంచి పేరు తెచ్చుకొని అగ్రగామిగా నిల్వాలని చెప్పారు. ద్యానంద్, మిల్కాసింగ్, అభినవ్ భింద్ర, విజేందర్ సింగ్, మేరికోమ్, కరణం మల్లీశ్వరి, రాజ్యవర్ధన్ రాథోడ్, పివి. సింధు, నిరణ్ చోప్రా, పలువురు క్రీడాకారులు భారతదేశానికి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టారని, పథకాలు సాధించి వారి సత్తాను ప్రపంచ దేశాలకు చాటిచెప్పారని కొనియాడారు. నేటికి భారతదేశంలో క్రీడా రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని, క్రీడలలో రాణించిన వారికి ప్రత్యేక గుర్తింపునివ్వాలని అన్నారు. ప్రోత్సహకాలను అందజేయడం ద్వారా ఔత్సాహికంగా పనిచేస్తారని చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు విన్యాసాలు చాలా ఆలోచింపచేశాయి. ఒలంపిక్స్లో జరిగే విధానాన్ని ఆకారాన్ని ఏర్పరిచి క్రీడా స్ఫూర్తిని పెంపొందించారు. క్రీడలలో రాణించే విదంగా పలు సాధనలు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లితండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శుద్ధ జలం ద్వారా మాత్రమే ఆరోగ్యం

## - ప్రభుత్వం వెంటనే రుణమాఫీని అమలు చేయాలి

## -డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు




కరీంనగర్, జూన్ 23: (నేటినిజం ప్రతినిధి): జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని కమ్మరిపేట గ్రామంలో శుక్రవారం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ కేంద్రాన్ని డాక్టర్ చిన్నమనేని వికాస్ డా.దీప ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే శుద్ధ జలాన్ని తాగాలని, శుద్ధ జలం తాగడం ద్వారా అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారని అన్నారు.

రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రజలందరూ గ్రామాల్లో కలిసిమెలిసి ఉంటేనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతిమ ఫౌండేషన్ వంటి కార్పోరేట్ సంస్థలతో మాట్లాడి సిఎస్ఆర్ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల దశా దిశను మార్చబోతున్నామని, గ్రామ అభివృద్ధికి గ్రామపంచాయతీలు కేంద్ర బిందువుగా ఉంటాయని, యువత మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో అనావృష్టి సమయాల్లో బ్యాంకులు రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే రుణాలు మంజూరు చేయాలని, మంజూరు చేసిన రుణాలను ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు

. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రతి మండలంలో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, యువత ఆర్థికంగా ఎదగడానికి చేయూతనిస్తే నవభారత నిర్మాణానికి యువజనులు తోడ్పడుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టల లక్ష్మి రాజారెడ్డి, పాలకవర్గం, గ్రామ పెద్దలు కోటగిరి లింగ గౌడ్, ఆడవాల లింగారెడ్డి, అడవాల గంగారాం, పుప్పాల రాంరెడ్డి, తలుకు నరేష్, గ్రామ ప్రజలు ఆయా కుల సంఘాల నాయకులు, ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైట్‌హౌజ్ విందులో ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూ డిల్లీ జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); వైట్‌హౌజ్ విందులోప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైట్‌హౌజ్ అధికారి విందు సందర్భంగా కలిసిపోతున్న రెండు దేశాల ప్రజలను ఆయన అభినందించారు. ఆస్కార్ విన్నింగ్ సాంగ్ 'నాటునాటు'కుఅమెరికన్లు డ్యాన్సలు చేస్తున్నారని, అలాడే హాలోవీన్ సందర్భంగా భారతీయ చిన్నారులు స్పైడర్‌మ్యాన్‌గా మారుతున్నారని ప్రధాని మోదీ ప్రశంసించారు. వైట్‌హౌజ్ విందులో ప్రధాని మోదీ పలు ఆసక్తికర అంశాలను ప్రస్తావించారు. రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాన్ని ప్రధాని మోదీ హైలైట్ చేశారు. ప్రతినిత్యం వారు ఒకరినొకరు బాగా తెలుసుకుంటున్నారని తెలిపారు. అధికారిక విందులో జో బైడెన్ పక్కన నిలబడి ఐకానిక్ హీరో క్యారెక్టర్ స్పైడర్‌మ్యాన్, ఎస్.ఎస్. రాజమౌళి ఖీఖీఖీ సినిమాలోని ఆస్కార్ విన్నింగ్ సాంగ్ 'నాటునాటు' పాటను ప్రేక్షకుల నవ్వుల మధ్య వినిపించారు. రోజులు గడిచే కొద్దీ భారతీయులు, అమెరికన్లు ఒకరినొకరు బాగా అర్థం తెలుసుకుంటున్నారని మోదీ అన్నారు.

# ఆషాఢ మాసం.. మహిళల గోరింటాకు సంబరాలు

వరంగల్, జూన్ 23: ఆషాఢం వచ్చిందంటే అతివలు గోరింటాకు సంబరాలు చేసుకుంటారు. ఈ మాసంలో పెళ్లయిన మహిళలు తల్లిగారింటికి చేరుకుంటారు. పెళ్ళికాని యువతులు గోరింటాకు పెట్టుకుంటే ఎర్రగా పండితే వారికి సకల గుణాలను కలిగిన వరుడు దొరుకుతాడని భావిస్తారు. అదేవిధంగా పెళ్లి అయిన వారు తమ చేతులు ఎర్రగా పండితే సౌభాగ్యం గా భావిస్తారు. వరంగల్ జిల్లాలోని తొర్రూరులో వాసవి మాత కిట్టి పార్టీలో మహిళలు ఆటపాటలతో గడిపాడు. తమ చేతులకు గోరింటాకు పెట్టుకొని సందడి చేశారు.

# విపక్ష పార్టీలు, నాయకుల గత చరిత్ర ఏమిటి?

## – నిలదీసిన ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్ జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఐక్య కూటమి ప్రయత్నాల్లో భాగంగా పాట్నా లో సమావేశమైన విపక్ష పార్టీలు, నాయకుల గత చరిత్ర ఏమిటని ఏఐఎంఐఎం చీఫ్ అసదు ద్దీన్ ఒవైసీ శుక్రవారంనాడిక్కడ నిలదీశారు. కాంగ్రెస్ సహా ఇతర పార్టీలపై విమర్శలు గుప్పించారు. కేంద్రంలో బీజేపీ రెండుసార్లు అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ కారణం కాదా? అని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ మరోసారి 2024లో ప్రధాని కావాలని తాము కోరుకో వడం లేదని చెప్పారు.

### నితీష్ కుమార్‌పై ప్రశ్నల వర్షం..

విపక్ష పార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చే బాధ్యత తీసుకున్న నితీష్ కుమార్ ఒక పడవ నుంచి ఒక పడవ పైకి దూకుతుంటారని, బీజేపీ నుంచి మహాకూటమి వైపు, మహాకూటమి నుంచి తిరిగి బీజేపీ వైపు, మళ్లీ మహాకూటమి వైపు వెళ్తుంటారని విమర్శించారు. "నరేంద్ర మోదీ 2024లో దేశ ప్రధానమంత్రి కావాలని మేము కోరుకోవడం లేదు. అయితే, అందుకోసం మనం చేస్తున్న ప్రయత్నాలు ఏమటనేవి ముఖ్యం. ఇవాళ జరిగిన పాట్నా సమావేశం తీసుకుంటే, అక్కడ సమావేశమైన నాయకుల ట్రాక్ రికార్డు ఏమిటి? కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ కారణం కాదా? గోద్రా ఘటన జరిగినప్పుడు నితీష్ కుమార్ రైల్వే మంత్రిగా లేరా? గుజరాత్ మారణహోం జరిగినప్పుడు బీజేపీలో కొనసాగలేదా? బీజేపీతో పొత్తు కారణంగానే ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత బీజేపీని విడిచిపెట్టి మహాకూటమి ఏర్పాటు చేసి తిరిగి సీఎం అయ్యారు. మళ్లీ వాళ్లను వదిలిపెట్టి బీజేపీ వైపు వెళ్లారు. ఇప్పుడు తిరిగి బీజేపీని విడిచిపెట్టారు" అని ఒవైసీ అన్నారు.

### ఉద్ధవ్, కేజ్రీవాల్‌కు ప్రశ్నలు..

శివసేన (ఉద్ధవ్ వర్గం) సెక్యులర్ పార్టీగా మారిందా అని ఒవైసీ ప్రస్నించారు. ఉద్ధవ్ థాకరే సీఎంగా ఉన్నప్పుడు అసెంబ్లీలో మాట్లాడుతూ, బాబ్రి మసీదు కూల్చివేసినందుకు తాము గర్వపడుతున్నామని చెప్పాంని, రాజ్యాంగవిరుద్ధంగా 370వ అధికరణను బీజేపీ తొలగించినప్పుడు అందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మద్దతిచ్చారని గుర్తుచేశారు.

# వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

## -జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జూన్ 23:(నేటినిజం ప్రతినిధి): వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలిజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరాకు 10000 ఇస్తామన్న హామీ నాలుగు ఏళ్లు అయిపోయిందని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది వర్షాలు లేక ఇబ్బంది పడుతుంటే రైతుబంధు ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు.

వడ్ల కొనుగోలు అమ్మకాలలో ఇబ్బంది పడ్డ రైతాంగానిక సకాలంలో డబ్బులు ఇవ్వలేని పరిస్థితి తలెత్తిందన్నారు. కనీసం మీరు ఇచ్చిన మాట ప్రకారం ఈ వడగండ్ల వర్షం వల్ల నష్టపోయిన రైతాంగం ఎకరాకు 10000 వస్తాయని చూస్తున్న ఇప్పటికి కూడా డబ్బులు అందకపోవడం శోచనీయం అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వడగండ్ల వర్షం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఎన్నికలకు ముందు మీరు వచ్చి పరామర్శించి, ఎకరాకు 10000 ఇస్తామని చెప్పినప్పటికి ఇంకా రైతులకు అందలేదన్నారు. కేటీఆర్ రైతుల ఖాతాలో డబ్బులు పడ్డాయని చూసుకో అన్నారని, కానీ రైతుల ఖాతాలో వడగండ్ల వర్షం వల్ల నష్టపోయిన రైతులకు సంబంధించిన డబ్బు పడలేదన్నారు. వడగండ్ల వర్షం వల్ల నష్టపోయిన రైతందానికి ఎకరానికి 25000 ఇవ్వమని మేము అన్నామని, ఎంతో పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతును ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ గతంలోనే డిమాండ్ చేసిందని, ఈ ప్రభుత్వానికి ఇంతవరకు కూడా చలనం లేదన్నారు. తక్షణమే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది కాబట్టి రైతుబంధు, వడగండ్ల వర్షం వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు పదివేలు ఇస్తామన్న డబ్బులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ఇంకా ఈ డబ్బులు ఎప్పుడు ఇస్తారు, ఖాతాలో ఎప్పుడు వేస్తారని అని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. వెంటనే ఆ నిధులను వారి ఖాతాలో పరిహారం వేయాలని అన్నారు.

# మృతుడి కుటుంబానికి డాక్టర్ గోలి మోహన్ సాయం



రాజన్న సిరిసిల్ల, జూన్ 23:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గం కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో ఇటీవల గుండె పోటుతో మరణించిన సాదుపల్లి శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్ని బీఆరెస్ సీనియర్ నాయకులు డాక్టర్ గోలి మోహన్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యుల పరిస్థితిని గ్రామానికి చెందిన గౌడ కులస్తులు డాక్టర్ గోలి మోహన్ దృష్టికి తీసుకువచ్చారు. శ్రీనివాస్ గౌడ్ కు ఒక కుమార్తె, ఒక కుమారుడు వికలాంగుడై ఉన్నాడని, ఆర్థిక స్తోమత లేని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

అనంతరం డాక్టర్ గోలి మోహన్ శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి కూడా ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చి, ఆర్థిక సహాయాన్ని అందించారు. రాబోయే రోజుల్లో శ్రీనివాస్ గౌడ్ కూతురు చదువుకు సహాయం అందించి, ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తానని తెలిపారు. అంగవైకల్యం కలిగిన కుమారునికి సహాయం అందిస్తానని అన్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి అండగా ఉండాలని, మధ్యతరగతి కుటుంబాలకు ఒకరికొకరం సహాయం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పార్టీలకతీతంగా పేద కుటుంబాలకు అండగా ఉండాలని సూచించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి, కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించిన డాక్టర్ గోలి మోహన్ కు గౌడ కులస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ కాంపిటీషన్ పోస్టర్ ఆవిష్కరించిన సునీతరావు మరియు నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి, జూన్ 23 (నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గారి నివాసంలో సంగారెడ్డి జిల్లా మహిళా కమిటీ రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు గారు మరియు సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి గారు హాజరై రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ కాంపిటీషన్ పోస్టర్ ఆవిష్కరించి, 16 నుండి 35 సంవత్సరాల నిండిన మహిళలు మరియు యువకులు ప్రతి ఒక్కరు రిజిస్ట్రేషన్ చేసుకొని జూలై 2న జరగబోయే రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ ఎగ్జామ్ కు హాజరు కావాలని కోరారు.

# దేశంలో ఆకలి దారిద్ర్యాలు లేని రాష్ట్రం తెలంగాణ మాత్రమే : మంత్రి జగదీశ్ రెడ్డి




సూర్యాపేట, జూన్ 23: దేశంలో ఆకలి దారిద్ర్యాలు లేని రాష్ట్రం తెలంగాణ అని, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట పట్టణంలోని 7వ వార్డు ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లో బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు కొండేటి ఏడుకొండలు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి, దేశానికి శ్రీరామరక్ష అన్నారు. దేశవ్యాప్తంగా 30 శాతం మంది ప్రజలు ఒక్క పూట భోజనం మాత్రమే తింటూ మిగతాపూట పస్తులు ఉంటే, తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆకలి దారిద్ర్యాలను లేకుండా చేసిందన్నారు. దేశంలో నేటికీ రెండు పూటలా తిండి తింటున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు.

దేశంలో ఇంటింటికి 24 గంటల కరెంటు త్రాగునీరు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికీ చాలా గ్రామాల్లో కరెంటు లైన్‌లు కూడా లేవన్నారు. దేశవ్యాప్తంగా అత్యధికంగా 45 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో సైతం 40 వేల మందికి పెన్షన్‌లు అందజేస్తున్నామన్నారు. మెడికల్ కాలేజ్, మినీ ట్యాంక్ బండ్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు మీరు వేసిన ఓటు ద్వారానే వచ్చాయన్నారు. 2014 ముందు మూసీ ప్రాజెక్టు గేట్లు శిథిలావస్థకు చేరి నీరు వృధాగా పోతున్నా పట్టించుకున్న వారే లేరన్నారు. తాను గెలిచిన మరుక్షణమే ముఖ్యమంత్రి దృష్టికి మూసీ ప్రాజెక్టు దుస్థితిని తీసుకొచ్చి గేట్లను ఆధునీకరించామన్నారు. తద్వారా 30 వేల ఎకరాల్లోరూ. వెయ్యి కోట్ల విలువ చేసే పంటలు వండించారని తెలిపారు. సూర్యాపేట సుందరీకరణలో ఇంకా చేయవలసింది చాలా ఉందన్న మంత్రి, దేశంలో నెంబర్ వన్ పట్టణంగా సూర్యాపేటను తీర్చిదిద్దే యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఏడుకొండలు, మహిళా మోర్చా నాయకులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పాల్వాయి వెంకన్న, శైలజ, పాపారావు, అశోక్, లక్ష్మయ్య, చారి, నిర్మల, శ్రీరాములు, సైదా, మరో 200 మంది బిజెపి కార్యకర్తలు, మహిళా మోర్చా నాయకులు ఉన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాల అన్నపూర్ణ, జిల్లా గ్రంధాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్, కౌన్సిలర్లు భరత్ మహాజన్ భత్తుల జానీ, రాపర్తి శ్రీనివాస్, జానీ భాయ్, కడారి సతీష్ యాదవ్, గంగ లింగారెడ్డి పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమం- మంత్రి ఆదిమూలపు సురేష్

తాడేపల్లి (అమరావతి) జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): ప్రజల సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టామని, 11 రకాల ధృవపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందిస్తామని మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మంత్రి తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ 99.5 శాతం సంక్షేమ ఫలాలు అందించారని, నూటికి నూరు శాతం లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే జగన్ ఉద్దేశమన్నారు. ప్రజలను జల్లెడ పట్టి వారి సమస్యలను గుర్తించి సిబ్బంది పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమం పర్యవేక్షణకు 26 జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారన్నారు. 5 కోట్లకు పైగా ప్రజలకు 1.60 కోట్ల కుటుంబాలను కలసి సమస్యలను గుర్తిస్తారని, జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వందకు వంద శాతం విజయవంతం చేయాలని సీఎం ఆదేశించారన్నారు. వాలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి యాప్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

### పవన్ కళ్యాణ్‌పై మంత్రి అదిమూలపు సురేష్ కామెంట్స్..

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సీఎం జగన్‌పై, ప్రభుత్వంపై పిచ్చిగా మాట్లాడుతున్నారని మంత్రి అదిమూలపు సురేష్ మండిపడ్డారు. 5.30 కోట్ల కుటుంబాలకు అభివృద్ధి సంక్షేమం అందిందా లేదా అని సీఎం చూస్తున్నారని, చివరి అవకాశం అని ఒకరు, ఒక అవకాశం అని మరొకరు వస్తున్నారని విమర్శించారు. జగన్‌కు ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని, కేంద్రానికి పవన్ ఇచ్చిన స్క్రిప్టు ప్రకారం వారు కూడా ఇలాగే మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్న వారు దాన్ని నిరూపించాలని మంత్రి అదిమూలపు సురేష్ సవాల్ చేశారు. ఎస్సీలకు 25 స్కీంలు ఎత్తివేశారని పవన్ ఆరోపణలు చేశారని, దీనిపై త్వరలో వైట్ పేపర్‌ను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఎస్సీల కోసం ప్రభుత్వం ప్రతి పథకాన్ని ఎలా అమలు చేస్తుందో చెబుతామని, ఎస్సీలకు సబ్ ప్లాన్ సహా పలు పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని తాము అమలు చేస్తున్నామని, విజయవాడ నడి బొడ్డున అంబేద్కర్ భారీ విగ్రహాన్ని నిర్మిస్తున్నామని మంత్రి అదిమూలపు సురేష్ పేర్కొన్నారు.

# తెలంగాణలో మధుర జ్ఞాపకాలు

## -సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీ రామసుబ్రమణియన్




హైదరాబాద్, జూన్ 23:): ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా తాను హైదరాబాద్‌లో పనిచేసినప్పుడు తెలంగాణ ప్రాంతం మధుర జ్ఞాపకాలను ఇచ్చిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిన్ వీ రామసుబ్రమణియన్ గుర్తుచేసుకున్నారు. గురువారం హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ వీ రామసుబ్రమణియన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడా రు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ తెలంగాణ హైకోర్టు నుంచి పదోన్నతిపై హిమాచల్‌ప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తిగా వెళ్లిన తొలి వ్యక్తినని, ఉమ్మడి హైకోర్టు విభజన జరిగిన చారిత్రక ఘట్టంలో తానున్నానని వివరించారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రసంగిస్తూ నిజాంకాలం నాటి భూవివాదాల నుంచి అనేక కీలక తీర్పులను జస్టిస్ రామసుబ్రమణియన్ వెలువరించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏజీ బీఎస్ ప్రసాద్, బార్‌కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చెం గల్వ కళ్యాణ్ రావు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.